http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

సోమవారం 7 ఏప్రిల్ 2025

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.
ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

# లబ్ధిదారులతో సీఎం రేవంత్ సహపంక్తి భోజనం

- సన్నబియ్యం లబ్ధిదారుల కుటుంబంతో కలిసి సహపంక్తి భోజనం చేశారు సీఎం రేవంత్ రెడ్డి.
- 200 యూనిట్స్ ఉచిత కరెంట్, రూ. 500 గ్యాస్ సిలిండర్ పథకాలు అందుతున్నాయని ఆరా తీశారు సీఎం రేవంత్.
- భూరం శ్రీనివాసరావు అనే లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి వారి కుటుంబసభ్యులతో కలిసి ఆయన భోజనం చేశారు
- ముందుగా రేవంత్ రెడ్డికి స్థానిక మహిళలు మంగళహారతులు ఇచ్చి ఇంట్లోకి ఆహ్వానించారు.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

జిల్లాలోని సారపాకలో సన్నబియ్యం లబ్ధిదారుల కుటుంబంతో కలిసి సహపంక్తి భోజనం చేశారు సీఎం రేవంత్ రెడ్డి. సన్నబియ్యం పథకాన్ని అమలు చేస్తున్న నేపథ్యంలో పలు కుటుంబాలతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వంలోని నేతలు సహపంక్తి భోజనాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా సారపాకలో రేవంత్ రెడ్డి సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు. లబ్ధిదారుడి కుటుంబం యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సన్నబియ్యం ఎలా ఉన్నాయంటూ కుటుంబ సభ్యురాలు తులసమ్మను ఆరా తీశారు సీఎం. దొడ్డు బియ్యం పంపిణీ చేసినప్పుడు అసలు తీసుకునేందుకు ఆసక్తి చూపేవాళ్లం కాదని సీఎం రేవంత్ కు చెప్పిన తులసమ్మ.. ఇప్పుడు సన్నబియ్యం ఇవ్వడంతో కుటుంబానికి ఉపయోగంగా ఉంటుందని సంతోషం వ్యక్తం చేసింది. 200 యూనిట్స్ ఉచిత కరెంట్, రూ. 500 గ్యాస్ సిలిండర్ పథకాలు అందుతున్నాయని ఆరా తీశారు సీఎం రేవంత్. తమకు ఉచిత బస్సు ప్రయాణం ఎంతో సంతోషకరంగా ఉందని తులసమ్మ - మిగతా3లో



## బ్రిజేష్ ట్రిబ్యునల్ ఎదుట స్వయంగా హాజరవుతా

- గోదావరి, కృష్ణా జలాల వివాదంపై ఈనెల 15నుంచి విచారణ జరపనున్న నేపథ్యంలో న్యాయ బృందానికి పూర్తి సహకారం అందిస్తాం
- కృష్ణా జలాలను రెండు రాష్ట్రాలకు పంపిణీ చేయడంపై బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ గత నెలలో మూడు రోజుల పాటు విచారణ జరిపిన సంగతి తెలిసిందే.
- జల వివాదాలపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కీలక సమీక్ష

హైదరాబాద్

జల వివాదాలపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కీలక సమీక్ష నిర్వహించారు. ఇరిగేషన్ అధికారులు, సీనియర్ లాయర్లతో ఆయన చర్చించారు. గోదావరి, కృష్ణా జలాల వివాదంపై ఈనెల 15నుంచి విచారణ జరపనున్న నేపథ్యంలో న్యాయ బృందానికి పూర్తి సహకారం అందిస్తామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. బ్రిజేష్ ట్రిబ్యునల్ ఎదుట స్వయంగా హాజరవుతానని ఆయన చెప్పారు. కృష్ణా జలాలను రెండు రాష్ట్రాలకు పంపిణీ చేయడంపై బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ గత నెలలో మూడు రోజుల పాటు విచారణ - మిగతా3లో

## బీజేపీ బిఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందం

- బండి సంజయ్‌కు టీపీసీసీ స్ట్రాంగ్ కౌంటర్
- దమ్ముంటే బీసీల 42 శాతం రిజర్వేషన్లను 9 వ షెడ్యూల్లో చేర్చేలా చట్టబద్ధత కోసం ప్రధానిని ఒప్పించే దమ్ముందా?
- మహేష్ కుమార్ గౌడ్ పత్రికా ప్రకటన విడుదల
- రాష్ట్ర అధ్యక్షుడిగా ఢిల్లీ పెద్దలకు గులాం గిరి చేసిన పనులు మర్చిపోయావా బండి సంజయ్.
- కాంగ్రెస్ పార్టీ అనేది జాతీయ పార్టీ. ఏదైనా సమిష్టి నిర్ణయాలు ఉంటాయి
- అసెంబ్లీ పార్లమెంట్ ఎమ్మెల్సీ ఎన్నికల వలె స్థానిక సంస్థలు ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ బీజేపీ బిఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందం
- ఒంటరిగా పోటీ చేసే దమ్ము లేకనే రహస్య మిత్రులు బిఆర్ఎస్ తో చీకటి ఒప్పందం.



హైదరాబాద్

కేంద్ర మంత్రి, ఎంపీ బండి సంజయ్ కు టీపీసీసీ స్ట్రాంగ్ కౌంటరిచ్చింది. నోటికొచ్చింది మాట్లాడితే ఊరుకునే ప్రసక్తే లేదని, బండి సంజయ్ ఖబర్దార్ అంటూ హెచ్చరించారు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఈ మేరకు మహేష్ కుమార్ గౌడ్ పత్రికా ప్రకటన విడుదల చేశారు.' దమ్ముంటే బీసీల 42 శాతం రిజర్వేషన్లను 9 వ షెడ్యూల్లో చేర్చేలా చట్టబద్ధత కోసం ప్రధానిని ఒప్పించే దమ్ముందా? ఢిల్లీ పెద్దలకు భయపడే తెలంగాణ బిజెపి నేతలు బీసీల ధర్నాకు మొహం చాటేశారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఢిల్లీ పెద్దలకు గులాం గిరి చేసిన పనులు మర్చిపోయావా బండి సంజయ్. రాష్ట్ర అధ్యక్షుడిగా కేంద్ర మంత్రి చెప్పులు మోసిన చరిత్ర నీది నోటికొచ్చింది - మిగతా3లో



## కార్యకర్తలే మా పార్టీకి వెన్నెముక

- బీజేపీ వ్యవస్థాపక దినోత్సవంలో ప్రధాని
- దేశ పురోగతికి, 'వికసిత్ భారత్' స్వప్నాన్ని సాకారం చేసుకునేందుకు మా నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నాం
- దేశ ప్రజలు తమ పార్టీ సుపరిపాలన అజెండాను చూస్తున్నారు
- ఇటీవలి సంవత్సరాల్లో మేం సాధించిన విజయాల్లో ఇది ప్రతిబింబిస్తోంది
- లోక్‌సభ, అసెంబ్లీలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్నో విజయాలు సాధించాం

## మా పోరాటం ఇంకా ముగియలేదు

- కంచ గచ్చిబౌలి భూములపై కేటీఆర్ బహిరంగ లేఖ
- హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు 400 ఎకరాల కంచె గచ్చిబౌలి అడవిని కాపాడేందుకు నిస్వార్థంగా, ఉదాత్తమైన లక్ష్యాలతో చేపట్టిన ఆందోళన అద్భుతం
- పర్యావరణం కోసం విద్యార్థులు చేస్తున్న పోరాటానికి కలిసి వచ్చిన ప్రతి ఒక్కరికీ కేటీఆర్ ఈ సందర్భంగా ధన్యవాదాలు
- వందల రకాల జంతుజాలం, వృక్షజాతులతో ఉన్న ప్రాంతాన్ని కాపాడేందుకు, భవిష్యత్ తరాలకు అందించేందుకు విద్యార్థులు చేసిన పోరాటానికి దేశంలోని వివిధ రంగాల ప్రముఖులు కలిసి రావడం దీనికి నిదర్శనం

హైదరాబాద్

భవిష్యత్ తరాల కోసం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు చేసిన అద్భుతమైన పోరాటంపై కాంగ్రెస్ ప్రభుత్వం అపవాదులు వేస్తూ, బెదిరింపులకు దిగుతున్న సందర్భంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విద్యార్థులకు, పర్యావరణ కార్యకర్తలకు, ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు - మిగతా3లో



## కొందరు ఎప్పుడూ ఏడుస్తూనే ఉంటారు..



- స్టాలిన్‌కు మోదీ కౌంటర్
- కేంద్ర ప్రభుత్వం తమిళనాడుకు భారీగా నిధులు కేటాయిస్తోంది
- గతంతో పోలిస్తే మూడు రెట్లు ఎక్కువ నిధులు ఇచ్చాం
- రైల్వే ప్రాజెక్టులకు నిధులు గణనీయంగా పెంచాం"
- "తమిళనాడు అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది

## సీపీఎం ప్రధాన కార్యదర్శిగా ఎంఏ బేబీ



- ఎంఏ బేబీ పేరును పార్టీ కోఆర్డినేటర్ ప్రకాష్ కారత్ ప్రతిపాదించారు
- గత ఏడాది సెప్టెంబర్‌లో సీతారాం ఏచూరి మృతి అనంతరం ఆ పదవి ఖాళీగా ఉంది.
- నూతన ప్రధాన కార్యదర్శిగా కేరళ విద్యాశాఖ మాజీ మంత్రి ఎంఏ బేబీ ఎన్నిక
- మైనారిటీ కమ్యూనిటీ నుంచి సీపీఎం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తొలి నేత బేబీనే కావడం విశేషం.

# యూకే డాక్టర్‌నని చెప్పి.. ఏడుగురి ప్రాణాలు తీశాడు..!




**భోపాల్:** యూకే రిటర్న్డ్ డాక్టర్ పేరుతో ఓ వ్యక్తి ఆడిన నాటకం.. ఏడుగురి ప్రాణాలు తీసింది. కార్డియాలజీ స్పెషలిస్టునని 'ఫేక్ సర్టిఫికెట్లు సృష్టించి మధ్యప్రదేశ్ లోని దామోహ్ జిల్లాలో ఒక ఆస్పత్రిలో జాయినయ్యాడు. ఇక అంతే స్పెషలిస్టు కదా అని .. మేజర్ ఆపరేషన్లను అతనికే అప్పగించింది ఆ ఆస్పత్రి యాజమాన్యం. అంతే అతను ఆపరేషన్లు చేసిన వారిలో ఏడుగురు ప్రాణాలు కోల్పోవడంతో అసలు విషయం బయటపడింది. అతను యూకే డాక్టర్ కాదని, కార్డియాలజిస్ట్ అంతకన్నా కాదనే విషయం వెలుగుచూసింది. దీనిపై జాతీయ మానవ హక్కుల సంఘంగా తీవ్రంగా స్పందించింది. డాక్టర్ ఎన్ జాన్ కెన్ పేరుతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో జాయిన్ అయ్యాడు ఓ డాక్టర్. యూకేకు చెందిన కార్డియలాజిస్ట్ నని, దానికి సంబంధించిన డాక్యుమెంట్లన్నీ చూపించడంతో అతన్ని డాక్టర్ గా అపాయింట్ చేసుకున్నారు. ఇక అంతే వరుస పెట్టి ఆపరేషన్లు చేసేస్తున్నాడు. హార్ట్ కు సంబంధించిన ప్రాబ్లమ్ అయితే ఇక ఆపరేషన్ అంటున్నాడు. ఆ ఆస్పత్రికి ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భవా స్కీమ్ కు కూడా ఉండటంతో పేషెంట్లు కూడా ఆపరేషన్ కు సరే అంటున్నారు. ఇలా 15 ఆపరేషన్లు చేయగా, 7 గురు చనిపోయారు. దాంతో దీనిపై ఆరా తీయగా అతను ఫేక్ డాకర్ట్ అనే విషయం తెలిసింది. ఈ విషయాన్ని దామోహ్ చైల్డ్ వెల్ఫే కమిటీ అధ్యక్షుడు దీపక్ తివారీ వెలుగులోకి తేవడంతో ఆ డాక్టర్ అసలు కథ బయటపడింది. ఒక నెలలోనే అతను చూసిన ఏడుగురు మృతి చెందడంతో పెద్ద ఎత్తున కలకలం రేగింది.

ఫేక్ డాక్టర్ పై విచారణకు ఆదేశించాం

ఒక డాక్టర్ గా ఆస్పత్రిలో జాయిన్ అయి ఏడుగురు ప్రాణాలు పోవడానికి కారణమైన సదరు ఫేక్ డాక్టర్ పై విచారణ జరుగుతోందని జాతీయ మానవ హక్కుల సంఘం స్పష్టం చేసింది. ఈ మేరకు తమకు ఫిర్యాదు అందిందని, ఏడుగురి ప్రాణాలు పోవడానికి కారణమైన డాక్టర్ వ్యవహారం మా దృష్టికి వచ్చింది. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భవా స్కీమ్ కింద ఆపరేషన్ చేసి ఆ నిధుల్ని కూడా దుర్వినియోగం చేశాడు' అని ఎన్ హెచ్ ఆర్సీ సభ్యుడు ప్రియాంక్ కనూన్ గో పేర్కొన్నారు.

# సీపీఎం ప్రధాన కార్యదర్శిగా ఎంఏ బేబీ



**మదురై:** సీపీఎం నూతన ప్రధాన కార్యదర్శిగా కేరళ విద్యాశాఖ మాజీ మంత్రి ఎంఏ బేబీ ఎన్నికయ్యారు. మూడేళ్లకు ఒకసారి జరిగే సీపీఎం మహాసభలు తమిళనాడులోని మదురైలో ఆదివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఆయనను పార్టీ కొత్త కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఎంఏ బేబీ పేరును పార్టీ కోఆర్డినేటర్ ప్రకాష్ కారత్ ప్రతిపాదించారు. గత ఏడాది సెప్టెంబర్‌లో సీతారాం ఏచూరి మృతి అనంతరం ఆ పదవి ఖాళీగా ఉంది. తాత్కాలికంగా కారత్ ఆ పదవిని నిర్వహిస్తూ వచ్చారు. మైనారిటీ కమ్యూనిటీ నుంచి సీపీఎం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తొలి నేత బేబీనే కావడం విశేషం. కొల్లాం జిల్లా ప్రక్కులాంలో జన్మించిన బీఏ బేబీ (70) కేరళ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ)తో ప్రారంభించి ఆ తర్వాత జాతీయ అధ్యక్షుడు అయ్యారు. ఆ తర్వాత పార్టీ యూత్ వింగ్ డీవైఎఫ్ఐలో పనిచేశారు. 1986 నుంచి 1998 వరకూ సీపీఎం రాజ్యసభ సభ్యుడిగా ఆయన సేవలందించారు. ఎమర్జెన్సీ కాలంలో విద్యార్థులను, యువతను సమీకరించి జైలుశిక్ష కూడా అనుభవించారు. 2006లో కేరళలోని కుందర నుంచి తొలిసారి ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. 2006 నుంచి 2011 వరకూ వీఎస్ అచ్యుతానంద్ మంత్రివర్గంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. 2011లో తిరిగి కుందర నియోజకవర్గం నుంచే తిరిగి గెలుపొందారు. 2012 నుంచి సీపీఎం పొలిట్ బ్యూరోలో కొనసాగుతున్నారు. కాగా, 2014 లోక్‌సభ ఎన్నికల్లో కొల్లాం నుంచి పోటీ చేసి ఓడిపోయారు.


# కార్యకర్తలే మా పార్టీకి వెన్నెముక..



దేశంలోని ప్రజలందరూ బీజేపీ సుపరిపాలనను చూస్తున్నారని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఇటీవల పార్టీ సాధించిన అనేక చారిత్రాత్మక విజయాల్లో ఇది ప్రతిబింబిస్తోందని తెలిపారు. బీజేపీ 45వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పార్టీ శ్రేణులకు ఆయన శుభాకాంక్షలు చెప్పారు. దేశ పురోగతికి, 'వికసిత్ భారత్' స్వప్నాన్ని సాకారం చేసుకునేందుకు మా నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నామని ప్రధాని చెప్పారు. కార్యకర్తలే తమ పార్టీకి వెన్నెముకని, వారి శక్తి, ఉత్సాహం ప్రేరణాదాయకమని ప్రధాని మోదీ అన్నారు. కొన్ని దశాబ్దాలుగా పార్టీ బలోపేతం కోసం తమ జీవితాలను అంకితం చేసినవారి సేవలు మరువలేనివని చెప్పారు. దేశ ప్రజలు తమ పార్టీ సుపరిపాలన అజెండాను చూస్తున్నారని, ఇటీవలి సంవత్సరాల్లో మేం సాధించిన విజయాల్లో ఇది ప్రతిబింబిస్తోందని తెలిపారు. లోక్‌సభ, అసెంబ్లీలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్నో విజయాలు సాధించామన్నారు. సమాజ సర్వతోముఖాభివృద్ధి దిశగా తమ ప్రభుత్వాలు సేవ చేస్తుంటాయని ప్రధాని ట్వీట్ చేశారు. కాగా బీజేపీని 1980లలో స్థాపించారు. 1984లో జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీ కేవలం రెండు లోక్‌సభ స్థానాలను మాత్రమే గెలుచుకుంది. అయితే ఆ తర్వాత అటల్ బిహారీ వాజ్‌పేయీ, ఎల్‌కే అద్వానీల నాయకత్వంలో అంచెలంచెలుగా ఎదిగింది. ఆ విధంగా 1990లలో మిత్రపక్షాలతో కలిసి అధికారంలోకి వచ్చింది. అనంతరం 2014 నుంచి ప్రధాని మోదీ నేతృత్వంలో వరుసగా మూడోసారి కేంద్రంలో కొలువుదీరింది. కాగా పార్టీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రి అమిత్ షా సైతం శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు.

# మీ లక్ష్యం ఏమిటో ప్రతీరోజూ ప్రభుత్వం చెబుతుందా?'





**న్యూఢిల్లీ:** భారత్ కు చెందిన స్టార్టప్ కంపెనీలను ఉద్దేశించి కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ ఇటీవల చేసిన వ్యాఖ్యలకు బోట్ సహ వ్యవస్థాపకుడు అమన్ గుప్తా మద్దతు పలికారు. పీయూష్ చేసిన వ్యాఖ్యలపై పెద్ద ఎత్తును దుమారం చెలరేగగా, అమన్ గుప్తా మాత్రం ఆయన వ్యాఖ్యలను సమర్థించారు. పీయూష్ చేసిన వ్యాఖ్యల్లో తనకు తప్పు ఏమీ కనిపించలేదంటూ ట్వీట్ చేశారు అమన్ గుప్తా. పీయూష్ చెప్పిన దానికి వక్రార్థాలు సృష్టించాల్సిన అవసరం లేదన్నారు. ఆయన మాట్లాడిన మొత్తం స్పీచ్ తాను విన్నానని, అందులో తప్పులు వెతకాల్సిన పని లేదన్నారు అమన్ గుప్తా. 'స్టార్టప్ ఫౌండర్లకు మీ లక్ష్యం పెద్దదిగా ఉండాలని ప్రతీరోజూ గవర్నమెంట్ చెప్పలేదు. నేను అక్కడ ఉన్నాను. నేను ఆయన ప్రసంగం మొత్తం విన్నాను. ఆయనేమీ కంపెనీల వ్యవస్థాపలకు వ్యతిరేకం కాదు. మనపై నమ్మకం ఉంది కాబట్టే కొన్ని మంచి విషయాలు చెప్పారు. భారత్ ఇంకా మరింత వేగంగా ముందుకెళ్లాలనేది ఆయన ఉద్దేశం. మన లక్ష్యాలు ఉన్నతంగా ఉన్నప్పుడే వాటిని సాధించడానికి కృషి చేస్తామనేది ఆయన చెప్పిందాంట్లో నాకు అర్థమైంది' అంటూ అమన్ గుప్తా పేర్కొన్నారు. ఇటీవల జరిగిన స్టార్టప్ మహాకుంబ్ కార్యక్రమంలో కేంద్ర మంత్రి గోయల్ మాట్లాడుతూ.. దేశంలోని పలు స్టార్టప్ కంపెనీలు ఫుడ్ డెలివరీ, బెట్టింగ్, ఫాంటసీ స్పోర్ట్స్ వంటి యాప్‌లపై ఎక్కువగా దృష్టి సారించాయి. కానీ చైనాలోని స్టార్టప్‌లు మాత్రం ఇందుకు భిన్నమైన రంగాలను ఎంచుకుంటున్నాయని చెప్పారు. కానీ, మనం ఐస్‌క్రీం, చిప్స్ అమ్మడం దగ్గరే ఉన్నాం. ఇక్కడే మనం ఆగిపోకూడదు. డెలివరీ బాయ్స్/గర్ల్స్‌గానే మిగిలిపోదామా? అదే భారత్ లక్ష్యమా..? అది స్టార్టప్‌ల ఉద్దేశం కాదు కదా" అని అన్నారు. అయితే.. భారత్‌లో స్టార్టప్‌లను తక్కువ చేయొద్దంటూ కేంద్ర మంత్రి వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తడంతో కాంగ్రెస్ పార్టీ ఓ పోస్ట్ చేసింది. ఈ క్రమంలోనే భారత్ లోని పలు స్టార్టప్ కంపెనీలు కూడా పీయూష్ గోయల్ వ్యాఖ్యలపై ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ తరుణంలో బోట్ సహ వ్యవస్థాపకుడు పీయూష్ కు మద్దతుగా నిలవడం విశేషం.

## కొందరు ఎప్పుడూ ఏడుస్తూనే ఉంటారు



**రామేశ్వరం:** కొంతమందికి కారణం లేకుండానే ఎప్పుడూ ఏడ్చే అలవాటు ఉంటుందంటూ తమిళనాడు సీఎం స్టాలిన్‌పై ప్రధాని నరేంద్ర మోదీ పరోక్షంగా విమర్శలు గుప్పించారు. తమిళనాడులోని రామేశ్వరంలో జరిగిన బహిరంగ సభ వేదికగా ఆయన ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సీఎం స్టాలిన్ చేసిన ఆరోపణలను ఆయన ఖండిస్తూ.. కేంద్ర ప్రభుత్వం తమిళనాడుకు భారీగా నిధులు కేటాయిస్తోందని, గతంతో పోలిస్తే మూడు రెట్లు ఎక్కువ నిధులు ఇచ్చామని తెలిపారు. త్రిభాషా విధానంపై స్టాలిన్ వ్యాఖ్యలకు మోదీ కౌంటర్ ఇస్తూ.. తమిళ నాయకులు నాకు లేఖలు రాస్తుంటారు. ఒక్కరు కూడా మ్యాతభాష తమిళంలో సంతకం చేయరు. తమిళ భాషను గౌరవించండి.. తమిళంలో సంతకం చేయండి. చాలా రాష్ట్రాల్లో మ్యాతభాషలో వైద్య విద్యా బోధన జరుగుతోంది. తమిళనాడులోనూ తమిళంలో వైద్య విద్యను అందించాలి. గత దశాబ్దంలో తమిళనాడు అభివృద్ధికి కేంద్రం భారీగా నిధులు కేటాయించాం. రైల్వే ప్రాజెక్టులకు నిధులు గణనీయంగా పెంచాం" అని మోదీ చెప్పారు. "తమిళనాడు అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది. 2014 నుంచి అధికంగా తమిళనాడుకు ఇచ్చాం. 2014కు ముందు రైల్వే ప్రాజెక్టుకు ఏటా రూ.900 కోట్లు మాత్రమే వచ్చేవని, ఈ ఏడాది తమిళనాడు రైల్వే బడ్జెట్ రూ.6,000 కోట్లకు పైగా ఉందన్నారు. అభివృద్ధి చెందిన భారత్‌లో తమిళనాడు పాత్ర చాలా గొప్పదన్న మోదీ.. ఈ రాష్ట్రం ఎంత బలంగా ఉంటే మన దేశం అంత వేగంగా అభివృద్ధి చెందుతుందని ప్రధాని మోదీ అన్నారు.

## 131 రోజుల తర్వాత.. నిరాహార దీక్ష విరమించిన రైతు నాయకుడు జగ్జీత్ సింగ్



**చండీగఢ్:** పంజాబ్‌కు చెందిన రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దల్వాల్ 131 రోజుల తర్వాత నిరాహార దీక్షను విరమించారు. అయితే డిమాండ్ల సాధన కోసం ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని రైతు సంఘాలను కోరారు. పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)పై చట్టపరమైన హామీ, ఇతర రైతు సమస్యలపై కేంద్ర ప్రభుత్వం చర్యల కోసం గత ఏడాది నవంబర్ 26న జగ్జీత్ సింగ్ దల్వాల్ నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. అయితే ఆయన ఆరోగ్యం క్షీణిస్తుండటంతో రైతు సంఘాలు ఆందోళన చెందాయి. ఈ నేపథ్యంలో ఫతేగఢ్ సాహిబ్ జిల్లాలోని సిర్హింద్‌లో కిసాన్ మహాపంచాయత్ నిర్వహించారు. జగ్జీత్ సింగ్ దల్వాల్ నిరాహార దీక్ష ముగించాలని రైతుల సమావేశంలో కోరారు. ఈ నేపథ్యంలో శనివారం హాస్పిటల్ నుంచి ఇంటికి చేరుకున్న జగ్జీత్ సింగ్ దల్వాల్, రైతుల విన్నపం మేరకు ఆమరణ నిరాహార దీక్షను ఆదివారం ముగించారు. అయితే డిమాండ్ల సాధన కోసం ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని రైతు సంఘాలను ఆయన కోరారు. మరోవైపు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు కూడా నిరాహార దీక్షను విరమించాలని జగ్జీత్ సింగ్ దల్వాల్‌ను శనివారం కోరారు. రైతుల డిమాండ్లపై రైతు సంఘాల ప్రతినిధులతో మే 4న కేంద్ర ప్రభుత్వం చర్చలు జరుపుతుందని బిట్టు హామీ ఇచ్చారు. 'మీ ఆరోగ్యం చాలా ముఖ్యం. పంజాబ్ ప్రజలకు మీ జీవితం విలువైనది. రైతులు, రైతు కూలీల పోరాటానికి మీ నాయకత్వం ఎల్లప్పుడూ అవసరం' అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

## ప్రధాని పంబన్ కార్యక్రమానికి సీఎం స్టాలిన్ గైర్హాజరు.. డీలిమిటేషన్‌పై హామీ ఇవ్వాలని డిమాండ్



**చెన్నై:** తమిళనాడులోని రామేశ్వరంలో కొత్తగా నిర్మించిన పంబన్ రైల్వే బ్రిడ్జిని ప్రధాని మోదీ ఆదివారం ప్రారంభించారు. కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ పాల్గొన్న ఈ కార్యక్రమానికి సీఎం ఎంకే స్టాలిన్ గైర్హాజరయ్యారు. అయితే న్యాయమైన డీలిమిటేషన్‌పై ప్రధాని హామీ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం ఒక కార్యక్రమంలో సీఎం స్టాలిన్ మాట్లాడారు. ప్రతిపాదిత డీలిమిటేషన్ కసరత్తుపై తమిళనాడు ప్రజలు భయాందోళనలు చెందుతున్నారని తెలిపారు. కాగా, తమిళనాడు ప్రజల భయాలను పోగొట్టేందుకు ప్రధాని మోదీ హామీ ఇవ్వాలని ఎంకే స్టాలిన్ డిమాండ్ చేశారు. 'తమిళ గడ్డపై నిలబడి, ప్రధాని స్పష్టమైన హామీ ఇవ్వాలి. తమిళనాడుతో సహా జనాభా పెరుగుదలను విజయవంతంగా నియంత్రించిన ఇతర రాష్ట్రాలకు రాబోయే డీలిమిటేషన్ కసరత్తులో ఎలాంటి జరిమానా విధించకూడదు. పార్లమెంటు సీట్లలో రాష్ట్రాల వాటా చెక్కుచెదరకుండా చూడాలి. న్యాయమైన డీలిమిటేషన్ విధానంపై పార్లమెంట్‌లో తీర్మానం చేయాలి' అని అన్నారు. ప్రధాని మోదీ దీని గురించి బహిరంగంగా హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# మా పోరాటం ఇంకా ముగియలేదు..

-మొదటిపేజీ తరువాయి

400 ఎకరాల కంచె గచ్చిబౌలి అడవిని కాపాడేందుకు నిస్వార్థంగా, ఉదాత్తమైన లక్ష్యాలతో చేపట్టిన ఆందోళన అద్భుతమని, పర్యావరణం కోసం విద్యార్థులు చేస్తున్న పోరాటానికి కలిసి వచ్చిన ప్రతి ఒక్కరికీ కేటీఆర్ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం విద్యార్థుల పోరాటాన్ని తక్కువ చేసి చూపాలన్న కుట్రతో అనేక అపవాదులు వేస్తున్నా, నిస్వార్థమైన విద్యార్థి-ప్రజా పోరాటాలు ఎప్పటికైనా విజయం సాధిస్తాయని తన లేఖలో పేర్కొన్నారు. వందల రకాల జంతుజాలం, వృక్షజాతులతో ఉన్న ప్రాంతాన్ని కాపాడేందుకు, భవిష్యత్ తరాలకు అందించేందుకు విద్యార్థులు చేసిన పోరాటానికి దేశంలోని వివిధ రంగాల ప్రముఖులు కలిసి రావడం దీనికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఒక రియల్ ఎస్టేట్ దళారి మాదిరి ఆర్థిక ప్రయోజనాల కోసం ఆలోచించకుండా, భవిష్యత్ ప్రయోజనాల కోసం కంచె గచ్చిబౌలి వేలాన్ని పూర్తిగా విరమించుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అటెన్షన్ డైవర్షన్ కోసం, బెదిరింపు ధోరణిలో ఏకో పార్క్ ఏర్పాటు అంటూ, ఫోర్త్ సిటీకి సెంట్రల్ యూనివర్సిటీ తరలింపు అంటూ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మొదలుకొని ప్రతి కాంగ్రెస్ నాయకుడి వరకూ పక్కా కుట్రతో మాట్లాడుతున్న మాటలను కేటీఆర్ తన లేఖలో ఎండగట్టారు. 50 సంవత్సరాలకు పైగా సెంట్రల్ యూనివర్సిటీ పర్యావరణ పరిరక్షణకు, విజ్ఞానానికి కేంద్రంగా నిలిచిందని, కాంగ్రెస్ పార్టీ ప్రాపగండ చేస్తున్న ఏకో పార్క్ కన్నా గొప్పగా పర్యావరణ సమతుల్యత కలిగిన క్యాంపస్‌గా నిలిచిందని కేటీఆర్ తెలిపారు. విద్యార్థుల పోరాటం ఫలించి సుప్రీంకోర్టు



ప్రభుత్వం చేసిన పర్యావరణ హత్యను అడ్డుకున్నదని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రల నేపథ్యంలో ఈ పోరాటం పూర్తిగా అయిపోలేదని కేటీఆర్ తన లేఖలో తెలిపారు. 400 ఎకరాల పర్యావరణాన్ని కాపాడేందుకు పోరాటం ఇంకా మిగిలి ఉందని, ప్రభుత్వ కుట్రలను, బెదిరింపులను, దుష్ప్రచారాన్ని దాటుకొని ముందుకు సాగాల్సిన అవసరం ఉందని కేటీఆర్ తెలియజేశారు. ఈ పోరాటానికి విద్యార్థులు, పర్యావరణవేత్తలు, ప్రముఖులు, తెలంగాణ ప్రజలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే మా పార్టీ తరఫున 400 ఎకరాల పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని ప్రకటించిన విషయాన్ని కేటీఆర్ తెలియజేశారు. ప్రకృతికి విఘాతం కలగకుండా, యూనివర్సిటీకి ప్రమాదం రాకుండా బి ఆర్ ఎస్ పార్టీ విద్యార్థులకు అండగా ఉంటుందని కేటీఆర్ భరోసా ఇచ్చారు. ప్రభుత్వం సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల స్ఫూర్తిని, విద్యార్థుల ఆందోళనను దృష్టిలో ఉంచుకొని, పర్యావరణం కోసం 400 ఎకరాలను వేలం వేసే ప్రయత్నాన్ని పూర్తిగా విరమించుకుంటున్నట్లు వెంటనే ప్రకటించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అప్పటిదాకా ప్రస్తుత పోరాటాన్ని కొనసాగిద్దామని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# నెమళ్ల అరుపులు, పోలీసుల లాఠీచార్జీలు, జింకల చావులు, బుల్డోజర్లు కుడా ఏఐ సృష్టేనా..?

**సూర్యాపేట :** కంచె గచ్చిబౌలి భూముల వాస్తవాలను ఏఐకు ముడిపెట్టడం హాస్యాస్పదమని.. నెమళ్ల అరుపులు, పోలీసుల లాఠీచార్జీలు, జింకల చావులు, బుల్డోజర్లు కుడా ఏఐ సృష్టేనా అని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు. సీఎం రేవంత్ ఆధ్వర్యంలో జరిగిన రివ్యూలో ఆయన మాట్లాడినట్లు ప్రకటనలో వచ్చిన విషయాలపై జగదీష్ రెడ్డి స్పందించారు. ఈ సందర్భంగా ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రేవంత్ తీరు రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చేలా వుందని.. అసలు అది సీఎం స్థాయిలో జరగాల్సిన రివ్యూలా లేదని ఏద్దేవా చేశారు. సీఎం తీరుకు సామాన్య ప్రజలు సైతం నవ్వకుంటున్నరన్నారు. అధికారులు, అనుచరులు ఇస్తున్న సలహాలపై పునరాలోచన చేసి మాట్లాడితే మంచిదిని హితువు పలికారు. సుప్రీం కోర్టు ఆదేశాలను ధిక్కరించడం రేవంత్ పనిగా పెట్టుకున్నాడని.. ఏఐ యూనివర్సిటీ పెడతానన్న రేవంత్ ఆ విషయంలో ముందుకు సాగుతాడా అని ప్రశ్నించారు. ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ కన్నా మీ అనుముల ఇంటెలిజెన్స్‌ను నమ్ముకోవడమే మంచిదని.. వాళ్లిచ్చే బ్రిఫ్‌ను నమ్ముకుని నవ్వులపాలవుతున్నారన్నారు. అసలు %ూ×% కంచె గచ్చిబౌలిలో పుట్టిందా.. అక్కడ ఊర కుక్కలు జింకలను చంపింది %ూ×% సృష్టేనా అని ప్రశ్నించారు. లేనివి సృష్టించడం.. తప్పుడు ప్రచారాలు చేయడం కాంగ్రెస్, రేవంత్ రెడ్డికే అలవాటన్నారు. అసలు కంచె గచ్చిబౌలి విషయంలో రాజకీయాలు మాట్లాడలేదన్నారు. ఒకవైపు రాష్ట్రం నష్టపోతుంది.. జరిగిన అభివృద్ధి అంతా వెనక్కి పోతుందని.. దీనికి తోడు జాతీయంగా రాష్ట్ర ప్రతిష్ట దెబ్బతింటుందని బాధ




తప్ప మరొకటి లేదన్నారు. చైనా, పాకిస్తాన్ యుద్ధాలకు ఇక్కడ %ూ×%కి సంబంధం ఏమిటని.. ఆ విషయం గురించి అనేక మంది మాతో చెప్పి నవ్వుకుంటున్నారని ఈ సందర్భంగా అయన గుర్తు చేశారు. ఈ విషయంలో కోర్టుకు పోతమంటే వాళ్లకు చివాట్లు తప్పవన్నారు. జబ్బును గుర్తించకుండా మందులు వాడతామన్న తీరులా రేవంత్ పోకడ ఉందని.. సుప్రీం కోర్టు సుమోటోగా తీసుకున్నప్పుడే వాళ్ళ ఆలోచన మార్చుకోవాల్సిందన్నారు. యూనివర్సిటీనే మార్చుతామన్నా రేవంత్ లీకులు కూడా అనాలోచితమేనని.. అలాంటప్పుడు అసలు ఆ కొత్తగా యూనివర్సిటీ అనుకుంటున్న దగ్గరే 400 ఎకరాలు కూడా ఇచ్చుకోవచ్చుకదా అన్నారు. విద్యార్థులు, ప్రజలను తక్కువ అంచనా వేయడం సరికాదని.. రేవంత్ ఇప్పటికైనా తెలివితక్కువ పనులు మానుకుని అభివృద్ధిపై దృష్టి పెడితే మంచిదని ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి సూచించారు.

# 'హైదరాబాద్‌లో కూర్చొని మాట్లాడటం కాదు.. అది చేసిన కేసీఆర్ పుణ్యం'

**సిద్దిపేట:** కాళేశ్వరం ప్రాజెక్టు అనేది ఉత్తర తెలంగాణకు వర ప్రదాయిని.. హైదరాబాద్‌లో కూర్చొని కాళేశ్వరం కూలిందని చెప్పడం కాదు అంటూ ఘాటు విమర్శలు చేశారు మాజీ మంత్రి హరీష్ రావు. కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును చిన్నచూపు చూస్తున్నది. అన్ని రకాలుగా ప్రభుత్వాన్ని నిద్ర లేపే ప్రయత్నం చేశాం అంటూ వ్యాఖ్యలు చేశారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఆదివారం.. చిన్న కోదూరు మండలం చౌడారం గ్రామం వద్ద బిక్క బండకు వెళ్లే కాలువకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ..'కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నేడు రంగనాయక సాగర్ రిజర్వాయర్ నుండి బిక్క బండ గుట్టకు నీళ్ళు విడుదల చేయడం జరిగింది. గత ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో భూసేకరణ కోసం ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును చిన్నచూపు చూస్తున్నది. ఇవ్వాళ ప్రాజెక్టులో నీళ్ళు ఉన్నాయి. రంగనాయక సాగర్ లో, కొండపోచమ్మ, మిడ్ మానేరు లో నీళ్ళు ఉన్నాయి. కక్షపూరితంగానే ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. కొత్తగా ఒక్క ఎకరం భూ సేకరణ చేయడం లేదు. కేసీఆర్ ప్రాజెక్టులు కట్టి సిస్టం అంత రెడీ చేశారు. పంపు హౌస్‌లు, రిజర్వాయర్లు, సబ్ స్టేషన్లు, మెయిన్ కెనాల్స్, డిస్ట్రిబ్యూషన్ కెనాల్స్ అన్ని రెడీగా ఉన్నాయి. కేవలం భూ సేకరణ చేసి కాలువలు తవ్వి రైతులకు నీళ్లు ఇవ్వాల్సింది ఉంది. కానీ, ఈ సంవత్సరం కాలంలో ఒక్క ఎకరా కూడా కాళేశ్వరం ప్రాజెక్టు



కింద భూసేకరణ చేయలేదు. చేయకపోవడం వల్ల చాలా చోట్ల కూడా రైతులు సొంత డబ్బులు పెట్టుకొని రైతులే స్వచ్ఛందంగా కాలువలు తవ్వకొని నీళ్ల తీసుకున్న సందర్భం ఉన్నది. కొండెంగులకుంట, బిక్కబండ రైతులు అందరూ వస్తే.. స్వంత డబ్బులతో మిషన్లు పెట్టి.. స్వంత డబ్బులు పెట్టీ, భూ సేకరణలో నష్ట పోతున్న వారికి డబ్బులు ఇచ్చి కాలువలు తవ్వి నీళ్లు అందిస్తున్నాం. ప్రభుత్వం పనిచేయట్లేదు. ప్రేమతో పని చేయాలి కానీ కక్షతో పని చేస్తున్నది. నిన్న కూడా ఉత్తమ్ కుమార్ రెడ్డితో మాట్లాడాను. పిల్ల కాలువలు తవ్వితే రైతులకు ఆయకట్టు పెరుగుతుంది. కనీసం 15, 20 కోట్లు భూసేకరణకు విడుదల చేయండి అని కోరాను. అసెంబ్లీలో కూడా కట్ మోషన్ ఇచ్చి నిరసన తెలపడం జరిగింది. అన్ని రకాలుగా ప్రభుత్వాన్ని నిద్ర లేపే ప్రయత్నం చేశాం. కాళేశ్వరం ప్రాజెక్టు అనేది ఉత్తర తెలంగాణకు వర ప్రదాయిని. కోకాకోలా ఫ్యాక్టరీ కూడా కాళేశ్వరం నీళ్లు ఉండబట్టి వచ్చింది. రైతులకు ఎంతో ఉపయోగపడుతుంది కాళేశ్వరం ప్రాజెక్టు. ప్రభుత్వం ఆలస్యం చేయకుండా కుంగిన ఒకటో రెండో పిల్లర్లను మరమ్మతులు చేసి నీళ్ళు ఇవ్వాలని కోరుతున్న. కాంగ్రెస్ వచ్చాక ఖమ్మంలోని పెద్దవాగు, సుంకిశాల, %ూాదీజ% సొరంగం, వట్టెం ప్రాజెక్టులు కూలిపోయాయి. కాళేశ్వరం అంటే మెగా ప్రాజెక్టు. కాళేశ్వరం ద్వారా సిద్దిపేట నియోజకవర్గంలో 52 వేల ఎకరాలకు నీళ్లు అందిస్తున్నాం. ఇది కేసీఆర్ చేసిన పుణ్యం. హైదరాబాద్ లో కూర్చొని కాళేశ్వరం కూలిందని చెప్పడం కాదు. సిద్దిపేట ఒక్కటే కాదు ఎన్నో నియోజకవర్గాలకు నీళ్ళు అందుతున్నాయి. ఇప్పటికైనా గోబెల్స్ ప్రచారం ఆపి భూ సేకరణ చేసి కాలువలు తవ్వి రైతాంగానికి నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం' అంటూ వ్యాఖ్యలు చేశారు.

## బ్రిజేష్ ట్రిబ్యునల్ ఎదుట స్వయంగా హాజరవుతా

-మొదటిపేజీ తరువాయి

జరిపిన సంగతి తెలిసిందే. కృష్ణా జలాల్లో తెలంగాణకు 555 టీఎంసీలు కేటాయించినా, ఏపీకి నష్టమేమీ ఉండదని బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ స్పష్టం చేశారు. ఏపీ బేసిన్ బయట ప్రాంతాలకు కృష్ణా జలాలను ఏ మేరకు మళ్లిస్తోందని ట్రిబ్యునల్ చైర్మన్ జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ప్రశ్నించగా.. ఉమ్మడి రాష్ట్రంలో అంతర్గత ఏర్పాటు ద్వారా 512 టీఎంసీలను ఏపీ వినియోగించుకుంటోందని వైద్యనాథన్ వివరించారు.

ఇందులో ఇతర బేసిన్‌లకు 323 టీఎంసీలను మళ్లిస్తోందని, కృష్ణా బేసిన్‌లో 189 టీఎంసీలను మాత్రమే వినియోగిస్తోందని తెలిపారు. ఢిల్లీలో జస్టిస్ బ్రిజేష్‌కుమార్ అధ్యక్షతన జస్టిస్ రామ్మోహన్‌రెడ్డి, జస్టిస్ ఎస్.తాళపత్ర సభ్యులుగా ఉన్న ట్రిబ్యునల్ ఎదుట తన వాదనలు కొనసాగించారు. తదుపరి విచారణను ఏప్రిల్ 15-17కు ట్రిబ్యునల్ వాయిదా వేసింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున తుది వాదనలను వినగా, మిగతా వాదనలను ఏప్రిల్ 15 నుంచి చేపట్టే విచారణలో వింటామని ట్రిబ్యునల్ పేర్కొంది.

## బీజేపీ బిఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందం



-మొదటిపేజీ తరువాయి

మాట్లాడితే ఊరుకునే ప్రసక్తే లేదు. కాంగ్రెస్ పార్టీ అనేది జాతీయ పార్టీ. ఏదైనా సమిష్టి నిర్ణయాలు ఉంటాయి. అసెంబ్లీ పార్లమెంట్ ఎమ్మెల్సీ ఎన్నికల వలె స్థానిక సంస్థలు ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ బీజేపీ బిఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందం ఒంటరిగా పోటీ చేసే దమ్ము లేకనే రహస్య మిత్రులు బిఆర్ఎస్ తో చీకటి ఒప్పందం. బండి సంజయ్ లో రోజురోజుకు అభద్రత భావం పెరిగిపోతుంది. మోదీ, అమిత్ షా అనుమతి లేకుండా కనీసం టిఫిన్ కూడా చెయ్యడు. సొంత పార్టీ కార్యకర్తలే బండి సంజయ్ వైఖరిపై గుర్రుగా ఉన్నారు. అధ్యక్ష పదవి రాదని తెలిసి బండి సంజయ్ ఆగమాగం అయితుండు. గుర్తింపు కోసమే తాను కేంద్రమంత్రిని అని మర్చిపోయి దిగజారి బండి సంజయ్ మాట్లాడుతుండు. బీజేపీలో ఉనికి కోసం బండి సంజయ్ ఆరాటం. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధి బండి సంజయ్ కి కనిపించకపోవడం విడ్డూరం. సుదీర్ఘ కాలం అయినా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నియామకం చేసుకోలేని బీజేపీకి కాంగ్రెస్ హై కమాండ్ గురించి మాట్లాడే హక్కే లేదు. సీఎం రేవంత్ రెడ్డి పూర్తి పట్టు సాధించి బట్టే బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లులకు ఆమోదం లభించిందని అవగాహన లేకుండా బండి మాట్లాడుతున్నారు. హెచ్ సీయూ అంశం ఉన్నత న్యాయ స్థాన పరిదిలో ఉంది. ప్రభుత్వం కమిట్ వేసింది. రాజకీయ అవసరాల కోసం బండి సంజయ్ మాట్లాడడం సమంజసం కాదు. మైనార్టీ హక్కుల కోసం నిలబడి కాంగ్రెస్ వక్ఫ్ బోర్డు బిల్లు పై నిర్ణయం తీసుకుంది. కార్పొరేట్ సంస్థలను నయన భయానా బెదిరించి నిధులు రాబట్టుకున్న బీజేపీ నంబర్ వన్ గా నిలిచింది. సన్న బియ్యం బీజేపీ ఇస్తుంటే దేశం మొత్తం ఇవ్వచ్చు కదా?, సన్న బియ్యంతో తెలంగాణలో నిరుపేదలకు అసలైన పండుగను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చింది. దేశ చరిత్రలో నిలిచిపోయే కుల గణన, బీసీ బిల్లు, ఎస్సీ వర్గీకరణ సన్న బియ్యంను కాంగ్రెస్ హయంలో అమలు అయ్యాయి' అని స్పష్టం చేశారు.

## లబ్ధిదారులతో సీఎం రేవంత్ సహపంక్తి భోజనం

-మొదటిపేజీ తరువాయి

చెప్పుకొచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్ మండలం పంతంగిలో రేషన్ కార్డు లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేసిన మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి. ఈ మేరకు మాట్లాడిన రాజగోపాల్ రెడ్డి.. గతంలో దొడ్డు బియ్యం పెట్టినప్పుడు దళారులు, రైస్ మిల్లర్లు మాత్రమే బాగుపడేవారని, ఇప్పుడు సన్నబియ్యంతో ఆ పరిస్థితి లేదన్నారు. ఎవరు ఎన్ని అపోహలు సృష్టించిన రానున్న రోజుల్లో ప్రభుత్వం చెప్పిన హామీలన్నీ నెరవేరుస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

## రాష్ట్రానికే తలమానికంగా మంచిర్యాల అభివృద్ధి




**మంచిర్యాలక్రైం :** మంచిర్యాల నియోజకవర్గాన్ని రా ష్ట్రానికే తలమానికంగా అభివృద్ధి చేసి చూపిస్తానని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసా గర్‌రావు అన్నారు. ఆదివారం మంచిర్యాల సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. అనం తరం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటికే 50కోట్లతో చేప ట్టిన ఆసుపత్రి పనులు పూర్తి చేశామన్నా రు. మరో 250 కోట్లు త్వరలోనే మంజూ రవుతాయన్నారు. మంచిర్యాల నియోజక వర్గాన్ని విద్య, వైద్య రంగాల్లో మారుతు న్న పరిస్థితులకు అనుగుణంగా అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ఆసుపత్రిని 2027 జూన్ కల్లా అందుబాటులోకి తెస్తామన్నా రు. ఐబీ చౌరస్తాలో అంబేద్కర్ పాత విగ్రహం ఉన్న చోట కొత్తగా 12ఫీట్ల ఎత్తుతో పార్లమెంట్ నమూనాపై అంబే ద్కర్ విగ్రహాన్ని, మహాప్రస్థానాన్ని ఈ నెల 14న ప్రారంభిస్తామని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలను, నాయకుల ను ప్రజలు మర్చిపోయారన్నారు. అందు వల్లే బీజేపీ నాయకులు నియో జకవర్గం లోని దండేపల్లిలో చక్కర్లు కొడుతున్నార ని విమర్శించారు. రాముడి పేరు చెప్పి ఓట్లు అడగడం మానుకోవాలన్నారు. అయోధ్య నిర్మించిన ప్రాంతంలోనే ఓడిపోయినప్పటికీ బీజేపీ నాయకులకు బుద్ధి రావడం లేదన్నారు. మతం కాదు మానవత్వం ఉండాలని మతంకంటే మానవత్వమే గొప్పదన్నారు. అభివృద్ధి సంక్షేమాలనే తాను నమ్ముకు న్నానని ప్రజల రుణం తప్పకుండా తీర్చు కుంటానని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం అందిస్తుండడంతో ప్రజలు ఎంతో ఆనందంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, భానేష్, బొలిశెట్టి కిషన్, దశరథం, కాటం రాజేశం తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

# సమిష్టి డిమాండ్ తగ్గిపోతోంది

సాధారణంగా సమష్టి డిమాండ్ (మొత్తం డిమాండ్) అంటే ఒక నిర్దిష్ట ధర వద్ద, ఒక నిర్దిష్ట కాలంలో వస్తువులు, సేవలకు మార్పిడి చేయబడిన మొత్తం ద్రవ్యంగా వ్యక్తీకరించ బడుతుంది. మొత్తం డిమాండ్‌ను సాధారణంగా వినియోగం, పెట్టుబడి, ప్రభుత్వ వ్యయం, నికర ఎగుమతులు వంటి నాలుగు వనరుల మొత్తంగా వర్ణిస్తారు. ప్రపంచ సమష్టి డిమాండ్ తగ్గడానికి దోహదపడే ప్రధాన అంశాలుగా పెరుగుతున్న ద్రవ్యోల్బణం, జీవన వ్యయం వంటి వి ఉన్నాయి. ప్రపంచ ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, జీవన వ్యయ సంక్షోభం, ఇంధన ధరలు, వడ్డీ రేటు పెంపుదల, ప్రపంచ పరపతి కఠినత్వం, కొవిడ్ మహమ్మారి పరిణామాలు, లాజిస్టిక్స్ సవాళ్లు, ముడి పదార్థాల కొరత, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, రష్యా- ఉక్రెయిన్ యుద్ధం, వాణిజ్య అనిశ్చితి మొదలైనవి మొత్తం డిమాండ్ తగ్గడానికి కారణమవుతున్నాయి. సమష్టి డిమాండ్ తగ్గడం వల్ల వాస్తవ స్థూల దేశీయోత్పత్తి, ఆర్థిక ఉత్పత్తి తగ్గే అవకాశం ఉంది. అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) ప్రకారం 2025, 2026 సంవత్సరాల్లో ప్రపంచ వృద్ధి 3.3 శాతంగా అంచనా వేయబడింది, ఇది చారిత్రక (2000-19) సగటు 3.7 శాతం కంటే తక్కువ. అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో మందగమనం ప్రపంచ డిమాండ్ బలహీనపడటానికి దోహదం చేస్తుంది. అమెరికా, యూరోపియన్ దేశాల నుండి చైనా, భారతదేశం, బ్రెజిల్ వరకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలు ద్రవ్యోల్బణం, వడ్డీరేటు పెంపుదల, ప్రపంచ సరఫరా గొలుసు అంతరాయాలు, భౌగోళిక రాజకీయ అనిశ్చితుల మిశ్రమం కారణంగా తగ్గుతున్న సమష్టి డిమాండ్ సమస్యను ఎదుర్కొంటున్నాయి. అనేక ఇతర ఆర్థిక వ్యవస్థల మాదిరిగానే భారతదేశం కూడా తగ్గుతున్న మొత్తం డిమాండ్ ద్వారా గణనీయంగా ప్రభావితమవుతుంది. భారతదేశంలోమొత్తం డిమాండ్‌లో తగ్గుదల ప్రధానంగా తగ్గిన వినియోగం, తగ్గిన పెట్టుబడి, తగ్గుతున్న ప్రభుత్వ వ్యయం, బలహీనమైన నికర ఎగుమతుల నుండి వస్తుంది. ఏదేశమైనా దేశీయ వినియోగంపై ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. ఇది దాని స్థూల దేశీయోత్పత్తిలో గణనీయమైన భాగాన్ని కలిగి ఉంటుంది. అందువల్ల, డిమాండ్‌లో ఏదైనా మందగమనం ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాలలో భిన్న పరిణామాలను కలిగిస్తుంది. ఆర్థిక మాంద్యం, పేదరికం, అసమానత, రాజకీయ అస్థిరత, ముఖ్యంగా బ్యాంకింగ్ రంగంపై ప్రభావం, నిరర్థక ఆస్తులు (ఎన్‌పిఎలు) వంటి విస్తృత ఆర్థిక పరిణామాల కారణంగా భారతదేశం తగ్గుతున్న మొత్తం డిమాండ్ ద్వారా తీవ్రంగా ప్రభావితమవుతుంది. ఈ ప్రభావాలు ఉపాధి నుండి వ్యాపార పెట్టుబడి, ఎగుమతులు, ఆర్థిక ఆరోగ్యం వరకు వివిధ రంగాలలో అలలు రేపుతాయి. భారతదేశంలో మొత్తం డిమాండ్‌ను ప్రభావితం చేసే కీలక అంశాలు చూసినపుడు ద్రవ్యోల్బణ ఒత్తిడి ఫిబ్రవరి 2025లో 3.6%. ఇది కొనుగోలు శక్తిని తగ్గిస్తుంది, వినియోగాన్ని ప్రభావితం చేస్తుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ద్రవ్యోల్బణ ఒత్తిళ్లకు ప్రతిస్పందనగా వడ్డీ రేట్లను పెంచింది, ఇది ప్రైవేట్ పెట్టుబడి, వినియోగాన్ని తగ్గించవచ్చు, ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో అమెరికా, చైనా మందగమనం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, కోవిడ్ మహమ్మారి వంటి ప్రపంచ అంశాలు భారతదేశ ఎగుమతులు, పెట్టుబడి రాకపోకలు ద్రవ్యోల్బణంపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతాయి. ప్రభుత్వ సంస్కరణలు వస్తువులు, సేవల పన్ను (జిఎస్‌టి), మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ వంటి నిర్మాణాత్మక సంస్కరణలు దేశీయ తయారీ, పెట్టుబడి ఎగుమతులను పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. అయితే, వాటి పూర్తి ప్రభావాలు కార్యరూపం దాల్చడానికి సమయం పట్టవచ్చు. డిసెంబర్ 2024లో, భారత దేశంలో ప్రైవేట్ వినియోగం స్థూల దేశీయోత్పత్తిలో 64.8% వాటాను కలిగి ఉంది. కొవిడ్ మహమ్మారి తర్వాత గ్రామీణ భారతదేశం గణనీయమైన కోలుకుంది. అయినప్పటికీ పట్టణ ప్రాంతాలు ఇప్పటికీ మొత్తం వినియోగంలో ఎక్కువ వాటాను కలిగి ఉన్నాయి. అయితే, వ్యవసాయ ఇబ్బందులు, ఆదాయ అసమానత ఇతర నిర్మాణాత్మక సవాళ్ల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో వినియోగ వృద్ధి కొద్దిగా నెమ్మదిగా ఉంది. భారతదేశ రిటైల్ రంగం దేశ స్థూల దేశీయోత్పత్తికి దాదాపు 10% దోహదపడుతుంది. వచ్చే దశాబ్దంలో దాదాపు 9- 10% కాంపౌండ్ వార్షిక వృద్ధి రేటు (సిఎజిఆర్) వద్ద వృద్ధి చెందుతుందని అంచనా వేయబడింది, 2032 నాటికి దాదాపు %వి%2 ట్రిలియన్ల విలువను చేరుకుంటుంది. భారతదేశ వినియోగదారుల విశ్వాసం హెచ్చుతగ్గులకు లోనవుతోంది. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, అధిక ఇంధన ధరలు ఉపాధి ఆందోళనల కారణంగా 2024లో వినియోగదారుల ఆశావాదం తగ్గినట్లు నీల్సన్ ఐక్యూ వినియోగదారుల విశ్వాస సూచిక చూపించింది.సాంకేతికత, ఇ- కామర్స్, తయారీ వంటి రంగాలలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ప్రవాహాలు బలంగా ఉన్నాయి. 2024లో, ఏప్రిల్- డిసెంబర్ కాలంలో భారతదేశ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డిఐ) 27% పెరిగాయి. అయితే, అధిక నిష్క్రమణల కారణంగా నికర ఎఫ్‌డిఐ తగ్గింది. 2024 -25 ఆర్థిక సంవత్సరంలో, భారతదేశ ప్రభుత్వ వ్యయం 48.21 లక్షల కోట్లుగా అంచనా వేయబడింది, ఇది స్థూల దేశీయోత్పత్తి లో 19.4%.ఈ భాగాలలో ఏదైనా తగ్గుదల సమిష్టి డిమాండ్ తగ్గడానికి దారితీస్తుంది. మెరుగుపరచడానికి చర్యలు ఒక దేశం కేంద్రబ్యాంకు నియంత్రణలో ఉన్న ద్రవ్యవిధానం, రుణ వ్యయాలు, పెట్టుబడి, వినియోగదారుల ఖర్చులను ప్రభావితం చేయడం ద్వారా మొత్తం డిమాండ్‌ను నేరుగా ప్రభావితం చేస్తుంది. ఉదాహరణకు అమెరికాలోని ఫెడరల్ రిజర్వ్, యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ (ఇసిబి) ఆర్థిక వ్యవస్థను ఉత్తేజపరిచేందుకు వారి బెంచ్‌మార్క్ వడ్డీ రేట్లను తగ్గించవచ్చు. యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ జపాన్ గతంలో ప్రతికూల వడ్డీ రేట్లతో ప్రయోగాలు చేశాయి. ఆర్థిక వ్యవస్థలో డిమాండ్‌ను ప్రత్యక్షంగా ప్రభావితం చేయడానికి ప్రభుత్వాలు ఆర్థిక విధానాన్ని ఉపయోగించవచ్చు. చైనా బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్, 2021 అమెరికా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బిల్లు వంటి పెద్ద-స్థాయి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు మొత్తం డిమాండ్‌ను పెంచే లక్ష్యంతో ఆర్థిక ఉద్దీపన ప్రకటించాయి. కోవిడ్ మహమ్మారి సమయంలో అమెరికా నిరుద్యోగ బీమా ప్రయోజనాలు, అలాగే స్పెయిన్, ఫిన్లాండ్ వంటి దేశాలలో యూనివర్సల్ బేసిక్ ఇన్‌కమ్ (యుబిఐ) చర్చలు ఇందుకు ఉదాహరణలు. ఇటీవల, చైనా భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, మొత్తం డిమాండ్‌ను పెంచడానికి మౌలిక సదుపాయాలను ఉపయోగించుకోవడానికి ఒక ఉదాహరణ.

# ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో తెలుగు వారి భాగస్వామ్యం



తొమ్మిది దశాబ్దాల క్రితం 1930 ఏప్రిల్ 6 న మహాత్మా గాంధీ దండిలో ఉప్పు చట్టాలను ఉల్లంఘించి, వేలాది మందితో నిరసన తెలిపి, లక్షలాది మందిని చైతన్య పరిచిన సంఘటన. ఉప్పు పన్నును ధిక్కరిస్తూ మహాత్మా గాంధీ,1930 మార్చి 12 నుండి 1930 ఏప్రిల్ 6 వరకు, 384 కిలోమీటర్ల దూరం, వేలమంది సత్యాగ్రహులతో కలిసి పాదయాత్ర చేసి గుజరాత్ లోని దండి వద్ద ఉప్పు తయారు చేసి స్ఫూర్తిని కల్పించిన మరిచి పోలేని నేపథ్యం. భారత దేశ స్వాతంత్ర్య సమర చరిత్రలో బ్రిటిషు పాలనకు వ్యతిరేకంగా జరిపిన శాసనోల్లంఘనలో భాగంగా, మహాత్మా గాంధీ నేతృత్వంలో భారత జాతీయ కాంగ్రెసు జరిపిన అహింసాయుత సత్యాగ్రహమే ఉప్పు సత్యాగ్రహం. అది మహాత్మా గాంధీచే ప్రారంభించ బడిన ఒక అహింసా ప్రచారోద్యమం. ఇది బ్రిటిష్ రాజ్ కు వ్యతిరేకంగా జరిగింది. ఉప్పుపై పన్ను చెల్లించేందుకు నిరాకరించి, మార్చి 12, 1930న చేప ట్టిన దండి యాత్రనే ఉప్పు సత్యాగ్రహంగా పేర్కొంటారు. సంపూర్ణ స్వరాజ్యం కోసం బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమాల సారమే ఈ ఉప్పు సత్యాగ్రహం. ఈ యాత్ర సబర్మతి ఆశ్రమం నుంచి ఎనభై మందితో ప్రారంభమై గుజరాత్ లోని సముద్ర తీరంలో ఉన్న పల్లెటూరు దండి వరకూ సాగింది. కనుక దీనికి ఉప్పు సత్యాగ్రహ కార్యక్రమంగా పేర్కొంటారు. కోట్లమంది భారతీయులపై బ్రిటిష్ రాజ్ వేసే ఉప్పు పన్నుకు వ్యతిరేకించిన మౌన నిరసన కార్యక్రమం అది. దానిని దండి సత్యాగ్రహం అనీ, దండి యాత్ర అనీ, దండి మార్చ్ అనీ పిలుస్తారు. 1920 – 22 నాటి సహాయ నిరాకరణోద్యమం తరువాత ఈ మార్చ్ బ్రిటిష్ అధికారానికి అత్యంత ముఖ్యమైన వ్యవస్థీకృత సవాలు విసిరింది. 1930 జనవరి 26 న భారత జాతీయ కాంగ్రెస్ సంపూర్ణ స్వరాజ్య నినాదం ప్రకటించిన వెంటనే దండి సత్యాగ్రహం మొదలైంది. ఉప్పు పన్ను బ్రిటిష్ రాజ్ పన్ను ఆదాయంలో 8.2% వరకూ ఉంటుంది. పేద భారతీయులకు చాలా భారంగా ఉండే పన్ను ఇది. ఉప్పు తయారీనే నిరసనకు, సత్యాగ్రహానికి తాను ఎందుకు ఎంపిక చేసిందీ వివరిస్తూ గాంధీ... "గాలి, నీరూ... ఆ తరువాత బహుశా ఉప్పే జీవితానికి అత్యవసరం" అని అని పేర్కొన్నారు. ఉప్పు చట్టాలను ధిక్కరించడం ద్వారా గాంధీ శాసనోల్లంఘనను ప్రారంభిస్తారని ఫిబ్రవరి 5 న వార్తా పత్రికలు రాసాయి. ఉప్పు సత్యాగ్రహం మార్చి 12 న అహ్మదాబాదు లోని సబర్మతి ఆశ్రమంలో ప్రారంభమై ఏప్రిల్ 6 న దండిలో ముగుస్తుందని పత్రికలు పేర్కొన్నాయి. ఉప్పు పన్నును ధిక్కరిస్తూ మహాత్మా గాంధీ,1930 మార్చి 12 నుండి 1930 ఏప్రిల్ 6 వరకు, 384 కిలోమీటర్ల దూరం, వేలమంది సత్యాగ్రహులతో కలిసి పాదయాత్ర చేసి గుజరాత్ లోని దండి వద్ద ఉప్పు తయారు చేసారు. శాసనోల్లంఘన ఉద్యమంలో ఎక్కువ మంది పాల్గొనేలా స్ఫూర్తినిచ్చే బలమైన ప్రారంభ ఘటనగా దండి యాత్ర ఉపయోగ పడింది. మహాత్మా గాంధీ తన 79 మంది సత్యాగ్రహ వాలంటీర్లతో సబర్మతి ఆశ్రమంలో ఈ యాత్రను ప్రారంభించారు. ఈ సత్యాగ్రహం ప్రారంభానికి కొన్నిరోజుల కు ముందే బ్రిటిష్ వారు గాంధీని మార్చి 5, 1930 న అరెస్టు చేశారు. ఈ సత్యాగ్రహం దాదాపు ఒక సంవత్సర కాలం నడిచింది. ఈ సత్యాగ్రహం మూలంగా దాదాపు 80,000 వేలకు పైగా భారతీయులు కారాగారాల పాలయ్యారు. లక్షల కొద్దీ భారతీయులు స్వాతంత్రోద్యమం పట్ల ఆకర్షితులయ్యారు. దండి మార్చిలో మహాత్ముడితో పాటు 79 మంది అనుచరులు పాల్గొన్నారు. ఆంధ్ర ప్రాంతం నుంచి దండి మార్చిలో గాంధీతో పాటు నడిచిన ఏకైక తెలుగు వ్యక్తి యెర్నేని సుబ్రహ్మణ్యం. తర్వాత కాలంలో ఆయన గాంధీ సిద్ధాంతాలతో కొమరవోలులో ఒక ఆశ్రమాన్ని స్థాపించారు. నెల్లూరులో ఉప్పు సత్యాగ్రహం నిర్వహించిన దండు నారాయణ రాజును నాటి ప్రభుత్వం అరెస్టు చేసి జైల్లో పెట్టడంతో ఆయన అక్కడే మరణించారు. ఉప్పు సత్యాగ్రహం సమయం లోనే 'కవిరాజు' త్రిపురనేని రామస్వామి చౌదరి... "వీర గంధము తెచ్చినారము వీరులెవ్వరో తెల్పుడి" అనే గేయ కవితను రాశారు. మాక్సిం గోర్కీ రాసిన రష్యన్ నవల 'ది మదర్'ను 'అమ్మ' పేరుతో తెలుగులోకి అనువదించిన క్రొవ్విడి లింగరాజు ఈ ఉద్యమ సమయంలోనే దేశద్రోహం నేరంపై జైలుకెళ్లారు. బ్రహ్మ జోస్యుల సుబ్రహ్మణ్యం సీతానగర ఆశ్రమాన్ని స్థాపించారు. దీన్నే 'ఆంధ్రా దండి'గా పిలుస్తారు. ఉప్పు సత్యాగ్రహం సందర్భం లోనే కేంద్ర శాసన సభకు రామదాసు పంతులు, శాసన మండలి సభ్యత్వానికి స్వామి వెంకటాచలం రాజీనామాలు చేశారు. ఉప్పు చట్టాలను ఉల్లఘించి బులుసు సాంబమూర్తి, ఉన్నవ లక్ష్మీనారాయణ ( మాలపల్లి నవల రచయిత), ఖాసా సుబ్బారావు లాఠీ దెబ్బలు తిన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు మద్రాసులోని తన నివాసం వేదవనంలో సత్యాగ్రహ కేంద్రాలను ఏర్పాటు చేశారు. విశాఖ పట్నంలో తెన్నేటి విశ్వనాథం, మచిలీ పట్నంలో అయ్యదేవర కాళేశ్వరరావు, రాయలసీమ పరిధిలో కల్లూరి సుబ్బారావు ఉప్పు సత్యాగ్రహానికి నాయకత్వం వహించారు. నెల్లూరులోని మైపాడు బీచ్‌లో బెజవాడ గోపాలరెడ్డి ఉప్పు తయారు చేసి ప్రజలకు అమ్మారు. అలా లక్షలాది మంది తమ సొంత ఉప్పును తయారు చేసుకున్నారు.

# బంగ్లా తీరు మారాల్సిందే!



ఏదైనా మోతాదు మించితే వికటిస్తుంది. ఆశించిన ఫలితం రాకపోగా అనవసర ప్రయాస మిగులు తుంది. బంగ్లాదేశ్ ప్రధాన సలహాదారు మహమ్మద్ యూనస్‌కు ఆలస్యంగానైనా ఇది అర్థమైందో లేదో సందేహమే. గతవారం ఆయన చైనా పర్యటనకు వెళ్లారు. ఆ పర్యటన విజయవంతమైందని బంగ్లా ప్రభుత్వం ఘనంగా చెప్పుకుంది. కానీ అక్కడ తెలిసీ తెలియకుండా యూనస్ మాట్లాడిన మాటలవల్ల బంగ్లాకు ఒరిగిందేమీ లేకపోగా, ప్రధాని నరేంద్ర మోదీతో చెప్పించుకోవాల్సివచ్చింది. నిరుడు ఆగస్టులో ప్రజా ఉద్యమం పర్యవసానంగా అప్పటి బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా పదవి కోల్పోయి మన దేశంలో ఆశ్రయం పొందినప్పటినుంచీ ఇరు దేశాల సంబంధాలూ దెబ్బతిన్నాయి. అక్కడ మైనారిటీ హిందువులపై దాడులు, దౌర్జన్యాలు పెరిగాయి. హత్యలు, అత్యా చారాలు అధికమయ్యాయి. మత ఛాందసవాదుల ప్రాబల్యం ఎక్కువైంది. ఈ పరిణామాల అనంతరం ఇరు దేశాలమధ్యా ఉన్నతస్థాయి భేటీ జరగటం ఇదే ప్రథమం. శుక్రవారం థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో జరిగిన ఏడు దక్షిణాసియా, ఆగ్నేయాసియా దేశాల కూటమి బిమ్‌స్టెక్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా యూనస్‌తో విడిగా భేటీ అయినప్పుడు ఉద్రిక్తతలు పెంచే ప్రకటనలు చేయటం మానుకోవాలని మోదీ సూచించినట్టు చెబుతున్నారు. ద్వైపాక్షిక సంబంధాలు మెరుగు పడాలంటే నిర్మాణాత్మక, ఆచరణీయ వైఖరితో ఉండాలని కూడా సలహా ఇచ్చారట. తమ దేశంపై తప్పుడు ప్రచారం సాగుతోందని బంగ్లా దబాయించినా సామాజిక మాధ్యమాల్లోని వీడియోలు నిజమేమిటో వెల్లడిస్తూ వచ్చాయి. వీటిపై విచారణ జరిపించి బాధ్యులైన వారిని అరెస్టు చేయాలని, ఇవి పునరావృతం కానీయరాదని గతంలోనే మన దేశం డిమాండ్ చేసింది. ప్రస్తుత భేటీలో కూడా మోదీ దీన్ని లేవనెత్తారు. మాజీ ప్రధాని హసీనాను అప్పగించాలన్న యూనస్‌కు... అలా అడగటా నికి ఇది వేదిక కాదని మన విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ చెప్పాల్సి వచ్చింది. యూనస్ పూర్వాశ్రమంలో ఆర్థిక శాస్త్ర ఆచార్యుడు. గ్రామీణ బ్యాంకు వ్యవస్థ రూపశిల్పిగా, మైక్రో ఫైనాన్స్ విధాన నిర్ణేతగా బంగ్లా గ్రామీణ ప్రజల జీవనాన్ని మెరుగుపరిచేందుకు చేసినకృషికి 2006లో ఆయనకు నోబెల్ శాంతి పురస్కారం లభించింది. పలు ఐక్యరాజ్యసమితి అనుబంధ సంఘాలకు సారథ్యం వహించారు. ఇదంతా బాగున్నా షేక్ హసీనాతో వచ్చిన విభేదాల కార ణంగా ఆయనకు కష్టాలు మొదలయ్యాయి. కేసులు వచ్చి పడ్డాయి. మైక్రో ఫైనాన్స్ వ్యవస్థ వల్ల గ్రామీణులకు మేలు కలగకపోగా అప్పుల్లో కూరుకుపోయారన్న ఆరోపణలూ వచ్చాయి. తనకు ససేమిరా పడని హసీనాకు మన దేశం మద్దతుగా నిలిచిందన్న ఆక్రోశం యూనస్‌కు ఉండొచ్చు. ఇరుగు పొరుగు సత్సంబంధాలతో మెలగటం, ఇచ్చిపుచ్చుకోవటం, అభివృద్ధి సాధించటం అత్యవసరమని ఆయన ఇప్పటికీ గ్రహించలేదని చైనాలో ఆయన చేసిన వ్యాఖ్యలు చెబుతున్నాయి. ఈశాన్య భారత్‌లోని ఏడు రాష్ట్రాలూ సముద్రతీరం లేనివని, కనుక ఈ ప్రాంతంలో అందరూ తమపై ఆధారపడక తప్పదని యూనస్ చైనాలో వ్యాఖ్యానించారు. అక్కడితో ఆగలేదు. మౌలిక సదుపాయాలూ, కనెక్టివిటీ సరిగాలేని ఈ ప్రాంతంలో పెట్టుబడులకు భారీ అవకాశాలున్నాయని చైనాకు గుర్తుచేశారు. అది తెలివితక్కువతనమో, మతిమరుపోగానీ... భారత్‌కు రెండువైపులా 6,500 కిలోమీటర్ల పొడవైన విస్తృత తీరప్రాంతం ఉందన్న సంగతి ఆయనకు తట్టలేదు. ఈశాన్యంలో రహదారులు, రైల్వే నిర్మాణం మరింత మెరుగుపరిస్తే... జలరవాణాను పెంచితే దేశంలోని ఏ తీరప్రాంతంనుంచి అయినా విదేశాలకు ఎగుమతులు చేయటం ఎంత పని! యూనస్ వ్యాఖ్యల్ని అపార్థం చేసుకున్నారని బంగ్లా విదేశాంగ శాఖ ముక్తాయిస్తోంది. కానీ సమయమూ,సందర్భమూ గమనిస్తే అది నిజం కాదనిపిస్తుంది. తాము పాకిస్తాన్‌తోపాటు చైనాకు దగ్గర కాబోతు న్నామని మన దేశాన్ని నేరుగా హెచ్చరించటమే ఇది. బంగ్లాదేశ్‌కు ఆర్థిక కష్టాలు దండిగానే ఉన్నాయి. అందులో కొన్ని స్వయంకృతం. బంగ్లాకు ఇచ్చే ఆర్థిక సాయాన్ని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నిలిపేశారు. హసీనా పదవీచ్యుతి తర్వాత అక్కడ మతఛాందసుల వీరంగంతో మన దేశం కూడా బంగ్లాను దూరం పెట్టింది. దాంతో నిధుల లేమితో అది సతమతమవుతోంది. ఇటీవల బియ్యం కొరత ఏర్పడి అది పాకిస్తాన్‌ను ఆశ్రయించినా అక్కడినుంచి చాలినంత అందలేదు. పైగా భారత్‌నుంచి వచ్చే బియ్యంతో పోలిస్తే వ్యయం తడిసి మోపెడవుతోంది. ప్రధాన సలహాదారయ్యాక యూనస్‌ను మన ప్రభుత్వం అభినందించినా, భారత్‌లో పర్యటించాలని ఆహ్వానం పంపలేదు. అందుకే తొలి పర్యటనకు యూనస్ కావాలని చైనాను ఎంచుకున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే చైనాను ఆకాశానికెత్తి మనల్ని చిన్నబుచ్చే యత్నం చేశారు. ఇంతచేసినా 210 కోట్ల డాలర్ల పెట్టుబడికి చైనా సమ్మతించింది. దాదాపు వంద కంపెనీలు 100 కోట్ల డాలర్లమేర మదుపు చేయటానికి అంగీకరించాయి. ఈ రెండు ప్రతిపాదనలకూ నిర్దిష్ట గడువు లేదు. ఎప్పుడొస్తాయో తెలియదు. కానీ బంగ్లాకు తక్షణసాయం కావాలి. అది అధిక ధరలతో, నిత్యావసరాల కొరతతో సతమతమవుతోంది. మత ఛాందసులు ఈ స్థితిని తమకు అను కూలంగా మలుచుకునే పనిలో ఉన్నారు. మోదీ అన్నట్టు సుస్థిర, ప్రజాతంత్ర, శాంతియుత దేశ మన్న అభిప్రాయం కలిగించినప్పుడే బంగ్లాకు అన్నివైపులనుంచీ సాయం అందుతుంది. అరాచక శక్తులకు ఆటపట్టయితే, భారత్ వ్యతిరేకతే ఊపిరిగా బతుకుతానంటే ప్రయోజనం శూన్యం. యూనస్ ఈ సంగతిని ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచిది.

# పంచముఖి హనుమాన్ గుడి ప్రాంగణంలో శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం

**ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు..**



**అగ్ని ధార న్యూస్, మందమర్రి మండలం ఏప్రిల్ 6 :** మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలో శ్రీ పంచముఖి ఆంజనేయ స్వామి గుడి ప్రాంగణంలో సీతారామ కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగల జరిగినది. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో.. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.దాతల సహకారంతో కలసి,ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి తదుపరి అన్నదాన కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించారు.దాదాపు 25 సంవత్సరాల నుండి శ్రీరామ నవమి కళ్యాణ మహోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నామని ఆలయ అర్చకులు ఈ సందర్భంగా మాట్లాడడం జరిగింది. సీతారామ కళ్యాణ మహోత్సవానికి ముఖ్య అతిథులుగా విచ్చేసినటువంటి చెన్నూర్ శాసనసభ్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి, మందమర్రి సింగరేణి జి ఎం దేవేందర్, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఐపీఎస్, ఈ కళ్యాణ మహోత్సవానికి విచ్చేసి,పూజా కార్యక్రమాలలో పాల్గొనడం జరిగింది. అనంతరం చెన్నూరు శాసనసభ్యులు మాట్లాడుతూ... తెలంగాణలో ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజల క్షేమం కోసమే రెండు వందల యూనిట్ల ఉచిత కరెంట్,ఇందిరమ్మ ఇండ్లు వాటితో పాటు, యువకులకు మూడు లక్షల రూపాయల లోన్ ఇవ్వడం. అంతేకాకుండా రేషన్ కార్డు ఉన్న ప్రతి ఇంటికి సన్న బియ్యం ఇస్తున్నందుకు ప్రజలు కూడా సంతోషిస్తున్నారు. ప్రజలకు ప్రభుత్వం ఏదైతే మాట ఇచ్చిందో అది నిలబెట్టుకుంటుంది. అన్నారు మందమర్రి లో నన్ను గెలిపించిన తర్వాత రోడ్లు,డ్రైనేజీ, కాలువల నిర్మాణం వంటి పనులు అన్నిచోట్ల కూడా చేయడం జరిగింది. ఇంకా ముందు, ముందు మంచి పనులు చేపడతామని ప్రజా సమస్యలు తెలుసుకోని ముందుకు పోతామని చెప్పడం జరిగింది.

# మందమర్రి మండల శాఖ ఆధ్వర్యంలో.. ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవం



**ముఖ్య అతిథిగా.. దేవరనేని సంజీవరావు**

**జెండాను ఆవిష్కరించిన మండల అధ్యక్షులు గిర్నేటి జనార్ధన్**

**అగ్ని ధార న్యూస్, మందమర్రి మండలం ఏప్రిల్ 6 :** భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా,మందమర్రి మండలంలోని చిర్రకుంట గ్రామంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు గిర్నాటి జనార్ధన్ పార్టీ జెండాను ఆవిష్కరించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా.. మంచిర్యాల్ జిల్లా అవిర్భవ దినోత్సవ జాయింట్ కన్వీనర్ దేవరనేని.సంజీవరావుపాల్గొని,పార్టీ కార్యకర్తలతో ఆవిర్భావ దినోత్సవం,పార్టీ యొక్క ఔన్నత్యాన్ని చెప్పడం జరిగింది.అదేవిధంగా రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ మెజార్టీ స్థానాలను,మండలం నుండి గెలిపించడానికి పార్టీ కార్యకర్తలు నాయకులు తమ సహాయ సహకారాలు అందించి,రానున్న ఎన్నికల్లో బిజెపి సత్తా చాటుతుందని వారు అన్నారు.బిజెపి పార్టీలో పని చేసే కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమానికి నాయకులుమాజీ ఉపసర్పంచ్ కర్రె రాజయ్య,మాజీవార్డ్ మెంబర్లు ఎనగందుల రాజయ్య దుర్గం మల్లేష్,ఎనగందుల చిరంజీవి, కంది ముకుంద రెడ్డి,కందూరి రాజయ్య,మండే పోచయ్య కొప్పుతిరుపతి,నామసానీ శేఖర్,సిద్ధం శ్రీను పయ్యావుల రాజ్ కుమార్,ఉదయ్.దుర్గం శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆశీస్సులతో ప్రజలు చల్లగా ఉండాలి



**ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలోనిభక్త మార్కండేయ స్వామి,అంతిరింతుర కొండ ప్రసన్నాంజనేయ స్వామి మరియు జంగారెడ్డిపల్లి గ్రామంలోని హనుమాన్ దేవాలయాలలో శ్రీ సీతారామచంద్ర స్వామి వార్ల కళ్యాణ మహోత్సవ కార్యక్రమాలలో పాల్గొన్న టాస్క్ సి ఓ ఓ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ సీతారాముల కళ్యాణం ఉత్సవంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని అలాగే స్వామివారి ఆశీస్సులతో ప్రజలు పాడి పంటలతో చల్లగా ఉండాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమాల్లో...ఆలయ కమిటీ సభ్యులతో పాటు ఐక్యత ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు, నరేందర్ గౌడ్ చంద్రశేఖర్,దుడ్డు కృష్ణ,రఘు, యాదయ్య,శేఖర్, రవి యాదవ్,శ్రీపతి,శ్రీను, కళ్యాణ్,భాస్కర్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ఆది పురుషుని కళ్యాణం అంగరంగ వైభవంగా జరిపిన రామభక్తులు

**భక్తి శ్రద్ధలతో భజనలు, అరచేతిలో ఆరగించిన భోజనాలు**

**సీతారాములు చూస్తే సిగ్గుపడతారు**

**దశకంఠుడు చూస్తే నేనే ధన్యుడను అనుకుంటాడు**

**రాముడి తమ్ముళ్లకు తలవొంపులు**

**రావణాసురుడి తమ్ముళ్లకు తలబిరుసులు**





**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా:(** గంగవరం రామకృష్ణారెడ్డి)( శ్రీరామనవమి సందర్భంగా)( భక్తిశ్రద్ధలతో జరుపుకున్న శ్రీరామనవమి నుంచైనా రాముడి ఆలోచనలకు తగ్గట్టుగా అందరం నడుచుకుందాం)ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా ఆది పురుషుడైన శ్రీ రాముడి కళ్యాణాన్ని రామభక్తులు భక్తిశ్రద్ధలతో జరిపారు, మగవారు భజనలతోనూ ఆడవారు కోలాటాలతోను అట్టహాసంగా నిర్వహించారు. అనంతరం రకరకాల వంటకాలతో ముత్యాల తలంబ్రాలతో ఎంతో ముద్దుగా, ముచ్చటగా ఆనందకరమైన పాటలతో తాళ మేళాలతో తలంబ్రాలు తిలకించిన భక్తజనం ఒక్కసారిగా ఒళ్ళు మరిచి భక్తితో శ్రద్ధగా భజనలు ఎన్నో కోలాటాలు ఎన్నో అట్టహాసంగా నిర్వహించారు. ఈ భక్తి ఉత్సవాలలో తండ్రులు, ఉన్నారు,కొడుకులు, కోడళ్ళు ఉన్నారు ,ఉన్నారు తల్లులున్నారు భార్యలున్నారు ఎంతో బందు బలగం నిర్వహించారు. రాముడు ఆది పురుషుడు రామాయణం అంటే ఒక్ గొప్ప హితం,మనిషి జీవనానికి,ఇచ్చిన మాటకు అలా ఒకటీమిటి రామాయణంలో బంధాల గురించి అనుబంధాల గురించి రాజ్యాల గురించి రాజ్య పరిపాలన గురించి విజ్ఞానం గురించి నీతి గురించి వినోదం గురించి స్త్రీ పురుషుల బాధ్యతల గురించి మనిషికి ఉండవలసిన బలాలు, బలహీనతల గురించి పూస గుచ్చి నట్టు వివరించేదే రామాయణం రామాయణాన్ని మించిన గ్రంథం ఈ ప్రపంచంలో మరొకటి లేదని అంటారు ఇది నిజమే అని చెప్పేవాళ్లు అందరూ అంటారు. కానీ దేని కోసం రామున్ని పూజిస్తున్నాము దేనికోసం రామ కళ్యాణాన్ని నిర్వహిస్తున్నాం? నేడు నిర్వహిస్తారు రేపు మనిషి మర్చిపోతాడు దీని ఒక ఆచారంగా మాత్రమే మలుచుకున్నాడు మానవుడు ఒక్కొక్క రామ కళ్యాణానికి రామరాజ్యంలో ఉన్న ఒక్కొక్క నియమాలను అమలు చేసుకుంటూ వస్తే కనీసం 70 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో కుల మతాలు అన్నదమ్ములుగా వజ్ర వైడుర్యాలతో రాష్ట్రాలు సంపన్నంగా ఉండేవి అని చెప్పవచ్చు.

కానీ నేడు స్వార్థంతో మానవుడు రాముని ఒక ఉత్సవ విగ్రహం గా మార్చి తన ఆనందం కోసము తన ఆధిపత్యం కోసమో తన పేరు ప్రఖ్యాతుల కోసం మాత్రమే భక్తిని కనబరుస్తున్నాడే తప్ప రాముడి లాంటి గుణాన్ని కలిగి ఉందామని ఒక్కనాడు కూడ,ఏ ఒక్కరు కూడా ఆచరించుటలేదని చెప్పడానికి అడ్డుఏమి లేదు రాదు. ఆదర్శమూర్తి రాముడని అందరు అంటారు, ఆచరణలు, ఆలోచనలు అన్నీ రావణాసురుడిని పోలి ఉన్నాయి నేటి మనుషులలో, మాంసాహారాలు మానే మనిషి ఉన్నాడా? ఒకే మాట,ఒకే భార్య కలిగి ఉందాం అన్న ఆలోచన నేటి మానవులకు ఉందా? పోనీ ఒకే బాణం అన్నవిషయానికి వస్తే కుటుంబాన్ని కాపాడుకుందాం, దేశాన్ని కాపాడుకుందాం అని వీరత్వాన్ని కలిగిన శూరులు కరువయ్యారు నేడు!తండ్రి మాట జవదాట కుమారులు నేడు ఉన్నారా? కష్ట సమయంలో నష్టాన్ని భరించి భర్త వెంబడి నడిచే భార్యలు ఉన్నారా? రాముడి తమ్ముళ్ల భరత శత్రుఘ్నులు ఉన్నారా నేడు? హనుమంతుని స్నేహం ఆ శిశు బంధం, ఆవిరి అయిపోయిన ఈ సమాజం, పర స్త్రీ వ్యామోహంతో, ఆస్తుల కోసం అన్నదమ్ముల కుమ్ములాటలు, నమ్మకద్రోహం చేసే స్నేహంతో,దొంగతనాలు దోపిడీలకు అడ్డంగా మారిన సమాజంను అరికట్టడానికి అరిచి,అరిచి పిలిచినా రాముడు వస్తాడో లేడో కానీ రావణాసురుడి ఆలోచనలు పిలవకుండానే ఈ భూమిపై పీఠం వేసుకుని కూర్చున్నాయి, అడుగడుగునా,విభూషణులు,సుత్తిలేకుండా చెప్పాలంటే సూర్పనక్కలు ఎందరో సూదుల్లా గుచ్చి యువతను చెడు మార్గంలో నడిపిస్తున్నారు. ఆది పురుషుని కళ్యాణం రోజు ప్రతి ఏటా ఆనందంతో ఆడుదాం పాడుదాం కానీ ఆయన అడుగుజాడల్లో నడుద్దాం అన్నదే నా నినాదం ప్రతి ఒక్కరూ ఒక్కఅడుగు వేసి చూడండి ఆరు మాసాలలో రామరాజ్యం ఏర్పడుతుంది ప్రతి ఒక్కరూ ఒక రామునిగా ఆలోచిద్దాం అందరూ కలిసి ఆనందమైన రామరాజ్యాన్ని నిర్మిద్దాం.. యువతను చెడు మార్గంలో నడిపిస్తున్నారు. ఆది పురుషుని కళ్యాణం రోజు ప్రతి ఏటా ఆనందంతో ఆడుదాం పాడుదాం కానీ ఆయన అడుగుజాడల్లో నడుద్దాం అన్నదే నా నినాదం ప్రతి ఒక్కరూ ఒక్కఅడుగు వేసి చూడండి ఆరు మాసాలలో రామరాజ్యం ఏర్పడుతుంది ప్రతి ఒక్కరూ ఒక రామునిగా ఆలోచిద్దాం అందరూ కలిసి ఆనందమైన రామరాజ్యాన్ని నిర్మిద్దాం..

# క్యాతనపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి అందుబాటులోకి..

**చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి**



**అగ్ని ధార న్యూస్, మందమర్రి మండలం ఏప్రిల్ 6 :** క్యాతనపల్లి ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణము పూర్తి అయినందుకు చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి, కృతజ్ఞతలను తెలియజేస్తూ..పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి,చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకట్ స్వామి,పెద్దపల్లి ఎం.పీ గడ్డ వంశీకృష్ణ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా..పట్టణ అధ్యక్షులు పల్లెరాజు మాట్లాడుతూ...ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి,ఎం.పీగా ఉన్న సమయంలో.. శంకుస్థాపన చేసిన తరువాత వచ్చిన బిఆర్ఎస్ ప్రభుత్వ ఎమ్మెల్యేలు నల్లల ఓదెలు,బాల్క సుమన్ హయాంలో నిర్మాణ పనులు నత్తనడకగా నడిచి,క్యాతనపెల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి అవరోదం అయ్యారని, బిఆర్ఎస్ నాయకులు మేమేదో చేసాము అని ప్రగల్భాలు పలుకుతుండటం సిగ్గుచేటని అన్నారు.ఈ పది సంవత్సరాల కాలంలో బాల్క సుమన్ తో మున్సిపాలిటీకి ఒరిగిందేమీ లేదని, కనుచూపుమేరలో ఉండే క్యాతనపల్లి ఫ్లైఓవర్ ని పూర్తిచేయడంలో విఫలమయ్యారని దుయ్య బట్టారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఓడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ...ఎమ్మెల్యే వివేక్ అసెంబ్లీ ఎన్నికల్లో..క్యాతనపల్లి ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు,ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ క్రమం తప్పకుండా..నెల,నెల వర్క్ ప్రోగ్రెస్ పర్యవేక్షిస్తూ బ్రిడ్జి నిర్మాణం పూర్తికావటంలో విశేష కృషి నిజంగా మరువలేనిదని కొనియాడారు.బాల్క సుమన్ గత పది సంవత్సరాలలో బ్రిడ్జి నిర్మాణం జరగకూడదని దురుద్దేశంతో కాలయాపన చేస్తూ..క్యాతనపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి అడ్డు తగిలి,క్యాతనపల్లి ప్రజల ఆక్రోశాన్ని చవిచూసి ఎన్నికల్లో ఓటమిపాలైయ్యారని ఆరోపించారు.కక్ష సాధింపు చర్యలు తప్ప అభివృద్ధి చేయడం బాల్క సుమన్ కు తెలియదని హితవు పలికారు.కాంగ్రెస్ ముఖ్య నాయకులు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ..క్యాతనపల్లి గేటు వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు, ఎదుర్కొంటున్న,ప్రాణాలు బలి కొంటున్న ఏ ఒక్క రోజు కూడా, ఫ్లైఓవర్ నిర్మాణ విషయంలో సమీక్ష నిర్వహించలేదని అలాంటి ఎమ్మెల్యే బాల్క సుమన్ అని, కానీ, బిఆర్ఎస్ వర్గాలు వాళ్ల నాయకుడు క్యా తనపల్లి చేసిందేమీ లేదని తెలిసి కూడా అబద్ధపు ప్రచారాలను చేస్తూ పబ్బం గడుపుతున్నారని,ఇకనైనా వివేక్ వెంకటస్వామి నాయకత్వంలో క్యాతనపల్లి అభివృద్ధి లో పాలుపంచుకోవాలని బిఆర్ఎస్ శ్రేణులకు హితవు పలికారు.ఈ కార్యక్రమంలో..కేతనపల్లి మున్సిపాలిటీ మాజీ చైర్మన్ జంగం కల,ముఖ్య నాయకులు గాండ్ల సమ్మయ్య, మహంకాళి శ్రీనివాస్, మెట్ట సుధాకర్,పలిగిరి కనకరాజు,గోపతి బానేష్,పనస రాజు, కొక్కుల సతీష్,బింగి శివ, ఎర్రబెల్లి రాజేష్,కట్ల రమేష్,పుల్లూరి కళ్యాణ్, గోపు రాజం,లాడెన్,మేకల శ్రీను,ఆకుల వెంకటస్వామి,యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె దినేష్,మండల వైస్ ప్రెసిడెంట్ బోనగిరి రవి ,రామ కృష్ణ,సోషల్ మీడియా కోఆర్డినేటర్ భాస్కర్,రామ్ సాయి ,సంఘ తిరుపతి,సంపత్, మహిళ నాయకురాలు పుష్ప, సునీత,శారద, రాజేశ్వరి, సృజనతదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా..సీతారాముల కళ్యాణ మహోత్సవం





**ముఖ్య అతిథిగా..చెన్నూర్ ఎమ్మెల్యే**

**అగ్ని ధార న్యూస్, మందమర్రి మండలం ఏప్రిల్ 6 :** మంచిర్యాల జిల్లా, మందమర్రి పాత బస్టాండ్ మారుతి నగర్ కాలనీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో..శ్రీరామ నవమి పండగ సందర్భ ంగా,సీతా రాముల కళ్యాణ మహోత్సవాన్ని ఆదివారం రోజున,ఆలయ చైర్మన్ బండి సదానందం యాదవ్,మిగతా సభ్యులు కలిసి,ఘనంగా ఏర్పాటు చేయడం జరిగింది. సీతారా ముల కళ్యాణ మహోత్సవానికి విచ్చేసినటువంటి భక్తులకు ఆలయంలో అన్నదానం కార్యక్రమాన్ని చేప ట్టడం జరిగింది.అలాగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి చెన్నూర్ శాసనసభ్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ... మందమర్రిలో నన్ను గెలిపించిన తర్వాత కాలనీలలో రోడ్లు, డ్రైనేజీ కాలువలు,తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్క కుటుంబ సభ్యులకు సన్న బియ్యం ఇస్తున్నామని ఇంకా ముందు.. ముందు ప్రజలతో వారి సమస్యలు తెలుసుకొని ముందుకు సాగుతామని చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో ..ఆలయ సభ్యులు నాగుల దుర్గయ్య,ం ా%%రెడ్డి, రమేష్,సత్తన్న, రవీందర్ రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రామగుండం ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి

**రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుగంటి చందర్**

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** శ్రీ రామనవమి సందర్భంగా రామగుండం నియోజకవర్గం లోని 10 ఆలయాల్లో జరిగిన శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవంలో పాల్గొని.రామగుండం ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండే విధంగా దీవించాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుగంటి చందర్ కోరుకున్నారు

# సతీ సమేతంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

**అగ్ని ధార న్యూస్, (రామగుండం):** శ్రీరామనవమి మహోత్సవాన్ని పురస్కరించుకొని, గోదావరిఖని కోదండ రామాలయం ఘనంగా నిర్వహించబడిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాల్లో రామగుండం శాసనసభ్యులు శ్రీ మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో శ్రీరాములవారి కళ్యాణోత్సవాన్ని ప్రత్యేకంగా నిర్వహించగా, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై భక్తి మయమైన వాతావరణాన్ని సృష్టించారు. శ్రీ సీతారాముల కళ్యాణాన్ని కన్నుల పండువగా వీక్షించిన భక్తులు ఆనందం వ్యక్తం చేశారుమాట్లాడిన ఎమ్మెల్యే, శ్రీరాముని జీవితం ధర్మ నిష్ఠకు ప్రతీకగా నిలుస్తుందని, నేటి యువత ఆ ఆదర్శాల ద్వారా స్ఫూర్తి పొందాలని పిలుపునిచ్చారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ఇలాంటి ఉత్సవాలు ఎంతో ఉపయోగకరమని అన్నారు.

# ఘనంగా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆరిఫ్ జన్మదిన వేడుకలు

## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** తలకొండపల్లి మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షులు ఆరిఫ్ జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కటింగ్ చేసి శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ,ఆమనగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీత నరసింహ, డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజీమ్, డిసిసి కార్యదర్శి రవీందర్ యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి డిగ్రీ కృష్ణ, యువజన కాంగ్రెస్ తాలూకా ప్రధాన కార్యదర్శి కాటిక నరేష్ , పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రమేష్ ,ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు చెన్నకేశవులు, మాజీ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జనార్దన్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, ప్రవీణ్ రెడ్డి ,బాలరాజ్, మైసయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



# సిరసన గండ్ల లో కన్నుల పండుగగా శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** ఘనంగా సిరసనగండ్ల శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణోత్సవం(శ్రీరామనవమి సందర్భంగా సిరసనగండ్ల శ్రీ రామచంద్ర స్వామి వారి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది.ఈ కళ్యాణోత్సవానికి స్వామివారికి రాష్ట్రప్రభుత్వం తరపున మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి,ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి లు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. సీతారాముల కల్యాణ వేడుకను తిలకించేందుకు ఆలయానికి భారీగా భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణమంతా రామ నామస్మరణతో మార్మోగుతోంది.శ్రీ సీతారామచంద్రస్వామి శ్రీరామనవమి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. . వేదపండితులు శాస్త్రోక్తంగా రాములోరి కల్యాణ ఉత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మధ్యాహ్నం 12.30 గంటల శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణం నిర్వ హించారు,కల్యాణ మహోత్సవంలో ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు. స్వామి వారి కల్యాణోత్సవం వీక్షించేందుకు వేలాది మంది భక్తులు సిర్సనగండ్ల కు తరలివచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు,ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి,మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, గువ్వల బాలరాజు, టాస్క్ సి ఓ ఓ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, పొల్యూషన్ బోర్డ్ సభ్యులు బాలాజీ సింగ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మట్టా వెంకటయ్య గౌడ్, సుదర్శన్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.



# అన్యోన్య జీవితానికి ఆదర్శం "సీతారాములు"



## పట్టు వస్త్రాలు సమర్పించి కళ్యాణంలో పాల్గొన్న వనపర్తి ఎమ్మెల్యే.మేఘారెడ్డి-శారద రెడ్డి దంపతులు

**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా:** భార్యాభర్తల అనుబంధానికి అన్నదమ్ముల అనురాగానికి.. తండ్రి కొడుకుల మమకారానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచే సీతారాములు అందరికీ ఆదర్శప్రాయులని వనపర్తి శాసనసభ్యులు.తూడి మేఘారెడ్డిపేర్కొన్నారు.శ్రీరామనవమి సందర్భంగా గోపాల్పేట మండల కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ కోదండ రామస్వామి ఆలయంలోని సీతారామ లక్ష్మణులకు ఆదివారం వనపర్తి ఎమ్మెల్యే.తూడి మేఘారెడ్డి, శారద రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.ముందుగా వారు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి స్వామి వారి కల్యాణంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యే దంపతులతో స్వామి వారికి కళ్యాణం చేయించారు.మొదటగా వారు వనపర్తి పట్టణంలోని రామాలయంలో సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం బుద్ధారం గండి ఆంజనేయ స్వామి ఆలయంలోనూ ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.ఆలాగే వనపర్తి పట్టణం మర్రికుంటలోని ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించిన సీతారాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.కార్యక్రమంలో గోపాల్పేట ఉమ్మడి మండల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ సత్య శీలా రెడ్డి, మాజీ జెడ్పిటిసి మంద భార్గవి, వనపర్తి మండల మాజీ జెడ్పిటిసి గొల్ల వెంకటయ్య, రేవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పర్వతాలు, కొంకి వెంకటేష్, శివన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ముత్తారం లో కనులాపండగగా జానకి రాముల కల్యాణం



**ముత్తారం అగ్నిదారా న్యూస్ :**ముత్తారం మండలంలో కేషనపల్లి ఖమ్మంపల్లి హరిపురం లక్కారం గ్రామాలలో రంగ రంగ వైభవంగా సీతారాముల కల్యాణం జరిపించారు మండల కేంద్రంలోని అభయాంజనేయ స్వామి గుడి వద్ద రామయ్య కళ్యాణ వేడుకలు కనుల పండుగగా జరిగింది ఆదివారం శ్రీరామనవమి పండుగ సందర్భంగాఅభిజిత్ లగ్న శుభ ముహూర్తన సీతారాముల కల్యాణం కమనియంగా సాగింది.ఈ కల్యాణాన్ని తిలకించేందుకు చుట్టూ పక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని భక్తులకు చల్లటి నీటితో పాటు మజ్జిక అన్నప్రసాదం అందజేయడం జరిగింది. శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆశీస్సులు ఉండాలని ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని పూజారులు అన్నారు.

# ప్రధాన్ మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకం ద్వారా ప్రతీ పేదవాడికి సన్న బియ్యం అందజేత .....!!

సొమ్మొకరిది సోకొకరిది అన్నట్టు వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం..
ప్రతీ రేషన్ షాపు ముందు మోడీ గ ఫోటో ఉంచాలని డిమాండ్
బిజెపి రామగుండం ఇంచార్జ్ కందుల సంధ్యారాణి..

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** ప్రధాన్ మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకం ద్వారా ప్రతీ పేదవాడికి 5 కిలోల సన్న బియ్యం ఉచితంగా అందజేస్తుందని బిజెపి రామగుండం ఇంచార్జ్ కందుల సంధ్యారాణి తెలియజేసారు.. గోదావరిఖని లోని పలు రేషన్ శాపులని సందర్శించి మోడీ గారి చిత్రపటాన్ని రేషన్ షాపు ముందు ఉంచాలని డిలర్లని డిమాండ్ చేశారు కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న 5కిలోల ఉచిత బియ్యానికి కేవలం ఒక కిలో బియ్యాన్ని అందజేస్తూ మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే అందజేస్తుందని అబద్ధపు ప్రచారం చేస్తుందని అన్నారు..కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచార తీరును చూస్తుంటే సొమ్మొకరిది సోకొకరిది అన్నట్టు ఉందని ఎద్దేవా చేసారు...

లబ్ధిదారులకు మోడీ అందజేస్తున్న ప్రభుత్వ పథకాల గురించి వివరించిరేషన్ షాపు ముందు మోడీ చిత్రపటాన్ని పెట్టేవరకు రేషన్ షాపు నుండి వెనుదిరిగి వెళ్ళేది లేదని డీలర్లను హెచ్చరించారు...ఈ కార్యక్రమంలో వారి వెంట బిజెపి నాయకులు కోమల మహేష్,కొండపర్తి సంజీవ్,మచ్చ విశ్వాస్ , ఆకాశ్,రంజిత్ ,కుర్ర రాజేందర్ మరియు బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు...

# ఖని లో ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**అగ్నిధార న్యూస్,(రామగుండం):** రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి.ఆదివారం స్థానిక బిజెపి ఆఫీస్ వద్ద జరిగే కార్యక్రమానికి పార్టీ సీనియర్ నాయకులు మహావాది రామన్న హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు.అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ అటల్ బిహారీ వాజ్‌పేయి,లాల్ కృష్ణ అద్వానీ నాయకత్వంలో 1980 ఏప్రిల్ 6న భారతీయ జనతా పార్టీ స్థాపించారని,1980లో ప్రారంభించిన పార్టీ దేశంలోని సామాజిక సమరసత,సాంఘిక, సాంస్కృతిక విలువల పరి రక్షణ,దృఢమైన జాతీయ రక్షణ ధ్యేయంగా ముందుకు సాగిందన్నారు.అమిత్ షా,జేపీనాడ్డా నాయకత్వంలో ప్రపంచంలో అతిపెద్ద పార్టీగా అవతరించిందన్నారు.నరేంద్ర మోదీ నేతృత్వంలో ప్రపంచంలో భరత్ ను విశ్వ గురువుగా నిలిపే ప్రయత్నం కొనసాగుతుందన్నారు.భారతదేశం ప్రపంచంలోనే ఒక పటిష్టమైన దేశంగా తీర్చిదిద్దడమే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థ గత ప్రభుత్వాలు సాధించలేని విధంగా మెరుగు పడిందని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు సోమారపు లావణ్య అరుణకుమార్,కాసిపేట శివాజీ,సుల్వ లక్ష్మీనారాయణ,పెద్దపల్లి రవీందర్,చంద్రశేఖర్,కోమల పురుషోత్తం,నవీన్ గౌడ్,చుక్కలరాములు,మంజుల,సతీష్, కుమారస్వామి,బండారి సతీష్,మేడి రాజు పాల్గొన్నారు.

# పేదోడి ఇంట్లో భోజనం చేసిన ఎమ్మెల్యే

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** రామగుండము శాసన సభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ స్థానిక 41వ డివిజన్ లో పర్యటించారు. ఈ సందర్భంగా సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేశారు. వారి కష్టసుఖాల గురించి అడిగి తెలుసు కున్నారు. సన్నబియ్యం లబ్ధిదారుల కుటుంబంతో సహపంక్తి భోజనం చేసిన ఎమ్మెల్యే.. లబ్ధి దారు కుటుంబం యోగ క్షేమాలు అడిగి తెలుసు కున్నారు. సన్నబియ్యం ఎలా ఉన్నాయంటూ కుటుంబ సభ్యురాలు తులసమ్మను ఆరా తీశారు.దొడ్డు బియ్యం పంపిణీ చేసినపుడు అసలు తీసుకునేందుకే ఆసక్తి చూపేవాళ్లం కాదని స్వప్నమ్మ సమాధాన మిచ్చింది. ఇప్పుడు సన్నబియ్యం ఇవ్వడంతో కుటుంబానికి ఉపయోగంగా ఉంటుందని సంతోషం వ్యక్తం చేసింది. 200 యూనిట్స్ ఉచిత కరెంట్, రూ.500 గ్యాస్ సిలిండర్ పథకాలు అందుతున్నాయా అని ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆరా తీశారు. ఉచిత బస్సు ప్రయాణం తమకు ఎంతో ఉపయోగ పడుతుందని స్వప్నమ్మ సంతోషం వ్యక్తం చేసింది.

ఇదిలా ఉండగా.. దేశంలోనే తొలిసారి రాష్ట్రంలోని రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం ఉగాది సందర్భంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. ఉగాది సందర్భంగా హుజూ ర్నగర్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి సన్నబియ్యం పంపిణీ స్కీమ్‌ను ప్రారంభించారు. పది మంది లబ్ధిదారులకు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సభా వేదికపైన సన్న బియ్యం పంపిణీ చేశారు.

# సీతారామ స్వామి ఆశీస్సులు ప్రజలపై ఉండాలి



టాస్క్ సి ఓ ఓ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** చారకొండ మండలం సిరసనగండ్ల శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణోత్సవం లో పాల్గొన్న టాస్క్ సీ ఓ ఓ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించుకుని ఆశీస్సులు తీసుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, సిరసనగండ్ల శ్రీ సీతా రాముల స్వామి దీవెనలు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆయన స్వామి వారి ని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో,కాంగ్రెస్ పార్టీ నాయకులు ఐక్యత పౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# సీతరామ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసిన ఉప్పల వెంకటేష్



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** కడ్తాల్ మండలం మైసిగండి శివాలయంలో శ్రీరామనవమి సందర్భంగా సీతా రామ స్వామి వారి కి ప్రత్యేక పూజలు చేసి స్వామివారి ఆశీస్సులు కల్వకుర్తి ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని కోరిన మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ ఈ కార్యక్రమంలో , డి సి సి బి డైరెక్టర్ గంప వెంకటేష్, అమృతం పాండు,వగ్గు మహేష్,నరేష్, మహేష్,కంబాలపల్లి శ్రీకాంత్,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సీతారాముల కళ్యాణ కార్యక్రమంలో పాల్గొన్న డోకూరి ప్రభాకర్ రెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** తలకొండపల్లి మండలంలోని చుక్కాపూర్ గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రీ సీతారామస్వామి కళ్యాణంలో పాల్గొన్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి, ఈ సందర్భంగా ఆయన స్వామి వారి ఆశీర్వాదం తీసుకొని,వారి ఆశీస్సులతో మండల ప్రజలు చల్లగా ఉండాలి అని కోరారు.యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రవీణ్ రెడ్డి,యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాజేందర్ నాయక్, చుక్కాపూర్ గ్రామ అధ్యక్షుడు రాజా లింగం, కాంగ్రెస్ పార్టీ నాయకులు రంగారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కుమార్, మరియు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్ :** ఆదివారం భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కమాన్పూర్ మండలంలో పార్టీ జెండా ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు కోయడ సతీష్ జెండా ఆవిష్కరించడం జరిగింది . నరేంద్ర మోడీ చేసే అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు ఆకర్షితులై నిన్నటికి నిన్న కేంద్ర నుంచి వస్తున్న సన్నబియాన్ని ప్రజలకు గరీబ్ కళ్యాణ్ యోజన పథకం కింద ఇంటింటికి సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుంది ఇలా చూసుకుంటా పోతే ఒక తెలంగాణ రాష్ట్రమే కాకుండా దేశం మొత్తానికి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసి భారతదేశాన్ని ఆర్థికంగా మూడో స్థానంలో నిలబెట్టిన ఘనత నరేంద్ర మోడీ గారిని అని మాట్లాడడం జరిగింది ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దండే లక్ష్మీనారాయణ మత్స్యగిరి రాము మట్ట శంకర్ సాయి కిషన్ రావు మల్లారపు అరుణ్ కుమార్కొంతకాని విశ్వతేజ బర్ల సాది తిరుపతి పిల్లి చంద్రయ్య సతీష్ బుద్ధార్తి శ్రీనివాస్ కొమ్ము శ్రీనివాస్ ప్రశాంత్ లక్ష్మణ స్వామి చిప్పకుర్తి సతీష్ ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది

# 8వకాలనీలో అంగరంగ వైభోగంగా సీతారామ కళ్యాణం



**అగ్నిధారన్యూస్** 8 ఇంక్లైన్ కాలనీ ఆదివారం రోజున శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సీతారాముల కళ్యాణము జగన్నాథచార్యుల వేద మంత్రోచ్ఛ ధనులతో జరిపించడం కళ్యాణ కార్యక్రమంలో జిఎం సతీమణి వనజ వెంకటయ్య, ఎస్ ఓ టు జి ఎం రాముడు దంపతులు, డీజీఎం సివిల్ ధనుంజయ్ దంపతులు ఏజీఎం ఎర్రన్న,°శాధికారి సివిల్ రాధాకృష్ణ సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిపించడం జరిగింది. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జగన్నాథచార్యులు శ్రీరాముని యొక్క గొప్పతనాన్ని గురించి వివరించడం జరిగింది కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## బిజినెస్

### ఒక తల్లిగా గర్వపడుతున్నా.. భగవంతుడిని అదే కోరుకున్నా : నీతా అంబానీ



తన చిన్న కుమారుడు అనంత్ అంబానీ గుజరాత్‌లోని తమ పూర్వీకుల స్వస్థలమైన జామ్‌నగర్ నుంచి శ్రీకృష్ణుడి దివ్యక్షేత్రమైన ద్వారకకు పాదయాత్ర చేయడంపై రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ సతీమణి నీతా అంబానీ సంతోషం వ్యక్తంచేశారు. అనంత్ అంబానీ ఆదివారం ద్వారకకు చేరుకొని శ్రీ కృష్ణుడిని దర్శించుకోవడం ద్వారా తన పాదయాత్రను ముగించారు. అనంతరం శ్రీరామ నవమిని పురస్కరించుకొని తల్లి నీతా అంబానీ, భార్య రాధికా మర్చంట్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాదయాత్రలో తనకు తోడుగా నిలిచిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ విషయంపై నీతా అంబానీ మాట్లాడుతూ.. తన కుమారుడు పది రోజులపాటు పాదయాత్ర చేసి ద్వారకకు చేరుకోవడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఒక తల్లిగా తనకు ఇది గర్వించదగ్గ సందర్భమని వ్యాఖ్యానించారు. అనంత్ అంబానీతోపాటు పాదయాత్రలో పాల్గొన్న యువకులంతా దేశ సంస్కృతిని వ్యాప్తి చేయడానికి కృషి చేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా అనంత్‌కు మరింత బలాన్ని, ఆరోగ్యాన్ని ఇవ్వాలని తాను భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు నీతా అంబానీ పేర్కొన్నారు. అనంత్ అంబానీ జామ్‌నగర్ నుంచి ద్వారకకు 170 కిలోమీటర్ల పాదయాత్రను మార్చి 29న ప్రారంభించారు. రోజుకు 20 కిలోమీటర్ల చొప్పున నడిచారు. ప్రతిరోజు రాత్రి వేళల్లో ఏడు గంటల చొప్పున నడుస్తూ మార్గమధ్యలో ఎదురయ్యే ప్రజలతో మాట్లాడుతూ ముందుకుసాగారు. ఈ యాత్రలో ఎక్కడికక్కడ స్థానికులు సైతం ఆయనకు సంఘీభావంగా నడిచారు. హనుమాన్ చాలిసా, సుందరకాండ, దేవీ స్తోత్రాలను వల్లె వేస్తూ ఈ ఆధ్యాత్మిక పాదయాత్రను అనంత్ ముగించారు.

### డెలివరీ చేతికి ఈకామ్ ఎక్స్‌ప్రెస్!




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 5:** సరుకు రవాణాలో అగ్రగామి సంస్థగా వెలుగొందడానికి డెలివరీ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. దీంట్లోభాగంగా తన పోటీ సంస్థయైన ఈకామ్ ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్‌ను కొనుగోలు చేయబోతున్నట్లు ప్రకటించింది. ఒప్పందం విలువ రూ.1,407 కోట్లు. షేర్ల కొనుగోలు ద్వారా జరగనున్న ఈ ఒప్పందం వచ్చే ఆరు నెలల్లో పూర్తికానున్నట్లు వెల్లడించింది. ఈ కొనుగోలు ఒప్పందానికి కంపెనీ బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు, కొనుగోలు అనంతరం ఈకామ్ సంస్థ యథావిధిగానే తన సేవలను కొనసాగించనున్నదని, అలాగే సబ్సిడరీగా కొనసాగుతుందని డెలివరీ ఎండీ, సీఈవో సైద్ సాహిల్ బారు తెలిపారు. ఇరు సంస్థల క్లయింట్లకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేయనున్నట్టు%ొ% మౌలిక సదుపాయల కల్పన, టెక్నాలజీ, నెట్‌వర్క్, ఉద్యోగాలను నియమించుకోవడానికి మరిన్ని పెట్టుబడులు పెట్టనున్నట్టు ఆయన ప్రకటించారు.

## భారత్‌లో ఇకపై ఈ రెండు బైకులు కనిపించవు!



ఇండియన్ మార్కెట్లో బీఎండబ్ల్యూ మోటోరాడ్ ఎప్పటికప్పుడు కొత్త బైకులను లాంచ్ చేస్తూ.. అధిక ప్రజాదరణ పొందుతోంది. అయితే కంపెనీ ఇప్పుడు భారతదేశంలో తన %+ 310 +ూ ు + 310 =% బైకులను నిలిపివేసింది. ప్రత్యర్థులకు గట్టి పోటీ ఇవ్వకపోవడం, అమ్మకాలు అంతంత మాత్రంగానే ఉండటం వల్ల కంపెనీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. నిజానికి కంపెనీ ఈ బైకుల డెలివరీలను 2025 జనవరి నుంచే నిలిపివేసింది. సుమారు ఏడు సంవత్సరాలు ఇండియాలో అమ్మకానికి ఉన్న అత్యంత సరసమైన ఈ బీఎండబ్ల్యూ బైకులను కంపెనీ దాని లైనప్ నుంచి తీసివేసింది. దీనిపై బీఎండబ్ల్యూ మోటోరాడ్ అధికారికంగా స్పందించలేదు. బీఎండబ్ల్యూ %+ 310 +ూ ు + 310 =% బైకులు 313 సీసీ సింగిల్ సిలిండర్ లిక్విడ్ కూల్డ్ ఇంజిన్ ద్వారా 34 %దీప్త్రజూ% పవర్, 28 %చీఎ% టార్క్ అందిస్తుంది. ఇంజిన్ 6 స్పీడ్ గేర్‌బాక్స్‌ను పొందుతుంది. జీ 310 జీఎస్ 145 కిమీ/గం వరకు వేగవంతం అవుతుంది. జీ 310 ఆర్ బైక్ టాప్ స్పీడ్ 143 కిమీ/గం. బీఎండబ్ల్యూ కంపెనీ ఈ రెండు బైకులను నిలిపివేయడానికి.. సరైన అమ్మకాలు లేకపోవడం మాత్రమే కాదు, పూర్తిగా కొత్త ప్లాట్‌ఫామ్‌కు మార్గం సుగమం చేసుకోవడానికి అని తెలుస్తోంది. బహుశా రాబోయే రోజుల్లో కొత్త బైకులు మార్కెట్లోకి లాంచ్ అయ్యే అవకాశం ఉందని, నిలిపివేసిన బైకుల స్థానాన్ని అవి భర్తీ చేస్తాయని తెలుస్తోంది.

## చైనా సుంకాల ప్రభావం గోల్డ్ రేటు మరింత తగ్గుతుందా?




అమెరికా అధ్యక్షుడు 'డొనాల్డ్ ట్రంప్' ప్రపంచ దేశాలపై సుంకాలను ప్రకటించారు. ఆ తరువాత చైనా.. యూఎస్ఏ మీద 34 శాతం ప్రతీకార సుంకం ప్రకటించింది. దీంతో బంగారం ధర సుమారు రూ. 2,800 లేదా రెండు శాతం తగ్గింది. అమెరికా ప్రతీకార సుంకాల కారణంగా స్టాక్ మార్కెట్ భారీ నష్టాలను చవిచూసింది. ఈ సమయంలోనే బంగారం ధరలు ఒక్కసారిగా తగ్గుముఖం పట్టాయి. భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతల కారణంగా గోల్డ్ రేటు మరింత తగ్గే అవకాశం ఉందని కమోడిటీ మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. అమెరికా, చైనాతో సహా ఇతర దేశాల మధ్య కొనసాగుతున్న వాణిజ్య యుద్ధం కారణంగా.. బంగారం ధరల ర్యాలీ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్నదని ఎస్ఎస్ వెల్త్‌స్ట్రీట్ వ్యవస్థాపకురాలు 'సుగంధ సచ్‌దేవా' పేర్కొన్నారు. అయితే అమ్మకాలు మాత్రమే స్థిరంగా కొనసాగుతున్నాయి. ఇండియన్ మార్కెట్లో బంగారం ధరలు రూ. 83,100 (22 క్యారెట్ 10 గ్రామ్స్), రూ. 90,660 (24 క్యారెట్ 10 గ్రామ్స్) వద్ద ఉన్నాయి. వెండి ధరలు కూడా భారీగానే తగ్గుముఖం పట్టాయి. రాబోయే రోజుల్లో బంగారం ధరలు మరింత తగ్గే సూచనలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు.

### స్టార్టప్‌లకు 10 వేల కోట్ల ప్రత్యేక ఫండ్




**న్యూఢిల్లీ :** నిధులు లేక సతమతమవుతున్న స్టార్టప్‌లను ఆర్థికంగా ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం రూ.10 వేల కోట్లతో ప్రత్యేక ఫండ్‌ను ఏర్పాటు చేయబోతున్నది. ఈ విషయాన్ని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. ఢిల్లీలో జరుగుతున్న స్టార్టప్ మహాకుంభ్ 2025 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదని, దీంట్లోభాగంగా సిడ్బీ ప్రత్యేకంగా చిన్నస్థాయి స్టార్టప్‌లకు ఆర్థికంగా సహాయ సహకారాలు అందించాలని సూచించారు. స్టార్టప్ వ్యవస్థాపకులు, ఎంటర్‌ప్రెన్యూర్‌ల తమ ఆలోచనలు అమలులోకి వచ్చేందుకు సిడ్బీ ప్రత్యేకంగా కృషి చేయాలని, ముఖ్యంగా ప్రతి రాష్ట్రంలో ఒక సెంటర్‌ను నెలకొల్పాలని ఆయన సూచించారు.

## 15 ఏళ్ల పాటు కలిసి ఆడుతామని అస్సలు అనుకోలేదు




విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ.. భారత క్రికెట్ చరిత్రలో తమకంటూ ప్రత్యేకంగా కొన్ని పేజీలను లిఖించుకున్నారు. బ్యాటర్లుగానే కాకుండా కెప్టెన్లగానూ కీలక పాత్ర పోషించిన ఇద్దరు మేటి ఆటగాళ్లు. రోహిత్ శర్మ కెప్టెన్‌గా భారత్‌కు రెండు ఐసీసీ టైటిల్స్‌ను అందించగా.. విరాట్ కోహ్లి సారథిగా ఆస్ట్రేలియా గడ్డపై తొలి టెస్టు సిరీస్ విజయాన్ని సాధించాడు. ఈ దిగ్గజ క్రికెటర్లు ప్రస్తుతం ఐపీఎల్-2025లో సీజన్‌లో బిజీబిజీగా ఉన్నారు. విరాట్ కోహ్లి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ప్రాతినిథ్యం వహిస్తుండగా.. రోహిత్ శర్మ ముంబై ఇండియన్స్ తరపున ఆడుతున్నాడు. సోమవారం(ఏప్రిల్ 7) వాంఖడే వేదికగా ఆర్సీబీ-ముంబై ఇండియన్స్ తలపడుతున్నాయి. ఈ క్రమంలో రోహిత్ శర్మతో తనకు ఉన్న అనుబంధాన్ని విరాట్ కోహ్లి అభిమానులతో పంచుకున్నాడు. గత 15 ఏళ్లగా తమ క్రికెట్ జర్నీ ఎలా జరిగిందో కోహ్లి వెల్లడించాడు. "ఎక్కువ కాలంగా ఒకరితో పాటు కలిసి ఆడుతున్నప్పుడు సహజంగా ఇద్దరి మధ్య మంచి అనుబంధమే ఉంటుంది. మా కెరీర్ ఆరంభంలో ఇద్దరికి ఒకే రకమైన సందేహాలు ఉండేవి. ఆ సమయంలో ఆటపై మాకున్న అవగాహనను ఒకరితో మరొకరు పంచుకుంటూ, నేర్చుకుంటూ ముందుకు వెళ్లాము. కెప్టెన్సీ విషయంలో కూడా ఇద్దరూ కలిసి పనిచేశాము. ఒకరు ఎక్కువ, మరొకరు తక్కువ అని తారతామ్యం లేకుండా మా జర్నీని కొనసాగించాము. మా ఆలోచనలను ఒకరికొకరు పంచుకునేవాళ్లం. మేమిద్దరం ఎక్కువగా ఒకే దానికి కట్టుబడి ఉండేవాళ్లం. ఆ నమ్మకమే జట్టు కోసం మరింత పనిచేయాలనే స్ఫూర్తినిచ్చింది. మేము ఇద్దరం కలిసిన ఆడిన సమయాన్ని ఆస్వాదించాము. మేము మా కెరీర్‌లను మరింత సుదీర్ఘంగా మార్చుకునేందుకు ప్రయత్నిస్తాము. మేము ఇద్దరం భారత్ తరపున 15 ఏళ్ల పాటు కలిసి ఆడుతామని నా కెరీర్ తొలినాళ్లలో అస్సలు అనుకోలేదు. మా ప్రయాణంలో ఎన్నో విలువైన జ్ఞాపకాలు ఉన్నాయి. రోహిత్‌తో ఇంత కాలం పాటు కలిసి ఈ ప్రయాణాన్ని కొనసాగించగలిగినందుకు చాలా సంతోషంగా ఉంది" అని కోహ్లి ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నాడు.

### 'సింహం వచ్చేసింది'.. బుమ్రా రాకతో జోష్‌లో ముంబై ఇండియన్స్




ఐపీఎల్ 18వ సీజన్‌లో ఓటములతో సతమతం అవుతున్న ముంబై ఇండియన్స్ అభిమానులకు తీపి కబురు. ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఆదివారం జట్టుతో కలిశాడు. ఈ విషయాన్ని ముంబై ఫ్రాంచైజీ వెల్లడించింది. 'సింహం వచ్చేసింది. రాజుగా మళ్లీ తన సామ్రాజ్యాన్ని పాలించేందుకు సిద్ధంగా ఉంది' అనే క్యాప్షన్‌తో పోస్ట్ పెట్టింది. దాంతో, ఐదుసార్లు ఛాంపియన్ ముంబై మళ్లీ జోరు కొనసాగించడం పక్కా అని ఫ్యాన్స్ మురిసిపోతున్నారు. వెన్నునొప్పి కారణంగా ఛాంపియన్స్ ట్రోఫీకి దూరమైన బుమ్రా ఐపీఎల్ ఆరంభ మ్యాచ్‌లకు అందుబాటులో లేడు. దాంతో, ఈ పేస్ గన్ రాక కోసం యాజమాన్యం, అభిమానులు ఎంతో ఆశగా ఎదురుచూశారు. ఈ క్రమంలోనే కెప్టెన్ హార్దిక్ పాండ్యా, కోచ్ మహేల జయవర్ధనేలు బుమ్రా కమ్ బ్యాక్ గురించి హింట్ ఇచ్చారు. గాయం నుంచి కోలుకున్నాడని త్వరలోనే జట్టుతో కలుస్తాడని మీడియాతో చెప్పారు. అనుకున్నట్టే నేషనల్ క్రికెట్ అకాడమీ అతడికి నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ ఇవ్వడంతో ముంబై స్క్వాడ్‌తో కలిశాడు. ఏప్రిల్ 7న వాంఖడేలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో మ్యాచ్‌లో ఈ యార్కర్ కింగ్ బరిలోకి దిగే అవకాశముంది.

**సీనియర్లు ఉన్నప్పటికీ..**

ఆనవాయితీ ప్రకారం వరుసగా 13వ సీజన్‌ను ముంబై ఇండియన్స్ ఓటమితో ఆరంభించింది. తొలి పోరులో చెన్నై సూపర్ కింగ్స్ చేతిలో చిత్తుగా ఓడింది. ఆ తర్వాత విజయంతో ఖాతా తెరిచినా.. మళ్లీ పరాజయం మూటగట్టుకుంది. ట్రెంట్ బౌల్ట్, దీపక్ చాహర్ వంటి సీనియర్లు ఉన్నప్పటికీ.. అనుభవజ్ఞుడైన బుమ్రా లేకపోవడంతో ముంబై బౌలింగ్ పదను తగ్గింది. పవర్ ప్లేలోనే వికెట్లు తీసి శుభారంభం ఇచ్చే ఈ యార్కర్ కింగ్ రాకతో ముంబై టీమ్ మరింత పటిష్టంగా మారనుంది.

## స్పోర్ట్స్

### సన్‌రైజర్స్ బ్యాటింగ్.. గుజరాత్ బౌలర్ల భరతం పడతారా..?




ఐపీఎల్ 18వ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ కీలక మ్యాచ్‌కు సిద్ధమైంది. హ్యాట్రిక్ ఓటములతో నిరాశపరిచిన కమిన్స్ సేన.. సొంత మైదానంలో గుజరాత్ టైటన్స్‌తో తలపడుతోంది. టాస్ గెలిచిన గుజరాత్ సారథి శుభ్‌మన్ గిల్ బౌలింగ్ తీసుకున్నాడు. ఈ గేమ్ కోసం ఇరుజట్లు రెండు మార్పులు చేశాయి. వాషింగ్టన్ సుందర్ గుజరాత్ టీమ్‌లోకి రాగా.. హర్షల్ పటేల్ స్థానంలో జయదేవ్ ఉనాద్కాట్‌ను తీసుకుంది హైదరాబాద్. ఈమ్యాచ్‌లో అయినా టాపార్డర్ విధ్వంసక ఇన్నింగ్స్ ఆడాలని.. మళ్లీ గెలుపు బాట పట్టాలని భావిస్తోంది హెస్ఆర్‌హెచ్. అయితే.. ఉప్పల్ స్టేడియంలో ఇరుజట్లకు ఇదే తొలి మ్యాచ్. కానీ, గత మూడు మ్యాచుల్లో హైదరాబాద్‌పై గుజరాత్‌దే పైచేయి. దాంతో, ఈసారి ఏం జరుగనుంది? అని అభిమానుల్లో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. హైదరాబాద్ తుది జట్టు : ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, నితీశ్ కుమార్ రెడ్డి, హెన్రిచ్ క్లాసెన్(వికెట్ కీపర్), అనికేత్ వర్మ, కమిందు మెండిస్, ప్యాట్ కమిన్స్(కెప్టెన్), జీషన్ అన్సారీ, జయదేవ్ ఉనాద్కాట్, షమీ. గుజరాత్ తుది జట్టు : సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్(కెప్టెన్), జోస్ బట్లర్(వికెట్ కీపర్), రాహుల్ తెవాటియా, షారుక్ ఖాన్, రషీద్ ఖాన్, వాషింగ్టన్ సుందర్, సాయి కిశోర్, సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, ఇషాంత్ శర్మ.





# కాబోయే భార్యతో అక్కినేని అఖిల్.. పెళ్లి కళ వచ్చేసిందా?

టాలీవుడ్‌లో అక్కినేని హీరో అఖిల్ ఏజెంట్ మూవీ తర్వాత ఎలాంటి ప్రాజెక్ట్‌ను అనౌన్స్ చేయలేదు. 2023లో థియేటర్లలో విడుదలైన ఈ సినిమా ఇటీవలే ఓటీటీలోకి వచ్చేసింది. బాక్సాఫీస్ వద్ద ఈ మూవీకి మిక్స్‌డ్ టాక్ రావడంతో ఓటీటీ రిలీజ్ కూడా ఆలస్యమైంది. ఈ చిత్రంలో మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి కీలక పాత్రలో కనిపించారు. అఖిల్ ప్రస్తుతం ఎలాంటి ప్రాజెక్ట్ ప్రకటించకపోవడంతో ఫ్యాన్స్ కాస్తా నిరాశకు గురవుతున్నారు. అయితే త్వరలోనే అఖిల్ బర్త్ డే సందర్భంగా కొత్త సినిమాను అనౌన్స్ చేయనున్నట్లు నిర్మాత నాగవంశీ ఇప్పటికే ట్విటర్ ద్వారా హింట్ ఇచ్చాడు. ఇక సినిమాల సంగతి పక్కనపెడితే.. అఖిల్ త్వరలోనే వివాహబంధంలోకి అడుగు పెట్టనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే తన ప్రియురాలు జైనాబ్ రావ్‌జీతో ఎంగేజ్‌మెంట్ కూడా చేసుకున్నారు. ఈ ఏడాది మార్చిలోనే పెళ్లి పీటలెక్కుతారని టాక్ వినిపించింది. కానీ అలా జరగలేదు. దీంతో మరోసారి టాలీవుడ్‌లో అఖిల్ పెళ్లి ఎప్పుడనే విషయంపై చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలో త్వరలోనే పెళ్లి చేసుకోబోయే అఖిల్, జైనాబ్ జంటగా కనిపించారు. హైదరాబాద్ విమానాశ్రయంలో ఒకరి చేయి ఒకరు పట్టుకుని సందడి చేశారు. ఇది చూసిన నెటిజన్స్.. చూడ ముచ్చటగా ఉన్నారంటూ కామెంట్స్ చేస్తున్నారు. అలాగే వీరి పెళ్లి పనులతో బిజీగా ఉన్నారేమో అంటూ పోస్టులు పెడుతున్నారు. వీరిద్దరు జంటగా వెళ్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మరోసారి అఖిల్ పెళ్లిపై చర్చ మొదలైంది. అయితే ఈనెల 8న అఖిల్ పుట్టినరోజు కావడంతో సెలబ్రేట్ చేసుకునేందుకు వెళ్లారా? అని మరికొందరు చర్చించుకుంటున్నారు.

# పాండ్య రూమర్ గర్ల్‌ఫ్రెండ్ జాస్మినె వలియా అదిరిపోయే ఫోటోలు



# వయసు మర్చిపోయి 30 ఏళ్ల అమ్మాయితో ప్రేమాయణమా? హీరోయిన్ రిప్లై ఇదే!



మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం హృదయపూర్వం. ఫిబ్రవరిలో ఈ సినిమా షూటింగ్ మొదలైంది. ఇందులో మాళవికా మోహనన్ కథానాయికగా నటిస్తోంది. ఇటీవల ఆమె సెట్‌లో దిగిన పలు ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. మోహన్‌లాల్‌తో కలిసి చిరునవ్వులు చిందిస్తున్న ఫోటో కూడా ఉంది. హృదయపూర్వం ఫస్ట్ షెడ్యూల్ పూర్తయింది. ఒక సినిమా కంప్లీట్ చేసుకుని మరో సినిమా చేస్తున్నప్పుడు కొత్తగా ఫ్రెండ్స్ అవుతారు. లేదంటే మంచి సహనటుల్లా ఉంటారు. కానీ కొన్నిసార్లు మాత్రమే అంతా ఒకే కుటుంబంలా అనిపిస్తుంది. ఈ సినిమా సెట్‌లో నాకు అలాగే అనిపించింది. నాకెంత సంతోషంగా ఉందో! మోహన్‌లాల్ సర్, సత్యన్ సర్ నుంచి ఎంతో నేర్చుకున్నాను. ఇలాంటి గొప్పవారితో కలిసి పని చేయడం అదృష్టంగా భావిస్తున్నాను అని రాసుకొచ్చింది. ఇది చూసిన ఓ వ్యక్తి వీరిని తప్పుపడుతూ కామెంట్ చేశాడు. 65 ఏళ్ల ముసలాయన.. 30 ఏళ్ల అమ్మాయితో ప్రేమాయణం.. ఈ ముసలి హీరోలు వారి వయసుకు సంబంధం లేని పాత్రల్ని పోషించేందుకు ఎందుకంత ఆసక్తి చూపిస్తారో అర్థం కాదు అని రాసుకొచ్చాడు. దీనికి మాళవిక స్పందిస్తూ.. సినిమాలో అతడు నన్ను ప్రేమిస్తాడని నీకెవరు చెప్పారు? నీకు నువ్వే కథలు అల్లేసుకుని ఏది పడితే అది మాట్లాడకు. నువ్వేదో ఊహించుకుని అవతలివారిని నిందించకు అని ఘాటుగా కౌంటర్ ఇచ్చింది. ఈ కామెంట్స్‌ను తర్వాత డిలీట్ చేసినట్లు తెలుస్తోంది.



# విజయ్ సేతుపతి పూరి జగన్నాథ్ ప్రాజెక్ట్‌లో టబు.!

టాలీవుడ్ దర్శకుడు పూరి జగన్నాథ్ ప్రస్తుతం తమిళ నటుడు విజయ్ సేతుపతితో ఒక సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఒకప్పుడు పోకిరి, దేశముదురు, అమ్మనాన్న ఓ తమిళ అమ్మాయి వంటి బ్లాక్ బస్టర్‌లతో పాటు ఇండస్ట్రీ హిట్‌లను అందించిన పూరి ప్రస్తుతం సరైన విజయం కోసం ఎదురుచూస్తున్నాడు. ఈ క్రమంలోనే విజయ్‌తో చేతులు కలిపాడు. 'పూరి కనెక్ట్స్' ఈ సినిమాను నిర్మించనుండగా.. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను నిర్మిస్తున్నట్టు తెలిపింది. రెగ్యులర్ షూటింగ్ జూన్ లో ప్రారంభమవుతుందని వెల్లడించింది. త్వరలోనే మరిన్ని అప్డేట్స్ ఇస్తామని తెలిపింది. ఈ సినిమాకు సినీ నటి చార్మి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. అయితే ఈ మూవీలో హీరోయిన్‌కి సంబంధించి ఒక సాలిడ్ న్యూస్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. ఈ ప్రాజెక్ట్‌లో బాలీవుడ్ హీరోయిన్ టబు కీలక పాత్రలో నటించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. టబుకి నెగటివ్ షేడ్స్ ఉన్న కీలక పాత్రను పూరి ఆఫర్ చేసినట్లు సమాచారం. దీనిపై టబు కూడా ఒకే చెప్పినట్లు తెలుస్తుంది. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# అనీల్ రావిపూడికి అలాంటి ఫోబియా ఉందా.. చచ్చిపోతానేమోనని భయం



రాజమౌళి తర్వాత టాలీవుడ్‌లో సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అంటే వెంటనే గుర్తుకు వచ్చే పేరు అనీల్ రావిపూడి. ఇప్పటి వరకు ఆయన తీసిన సినిమాలలో ఒక్క ఫ్లాప్ లేదు. సంవత్సరాలు కాకుండా రోజులలోనే చిత్ర షూటింగ్ పూర్తి చేసి మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నాడు. అనీల్ రావిపూడి అంటే కామెడీ చిత్రాలకి కేరాఫ్ అడ్రెస్ అన్నట్టు మారింది. జనాల పల్స్‌ని పట్టిన అనీల్ నేటి సమాజంలో జరుగుతున్న పరిస్థితులు ఆధారంగా సినిమాలు తెరకెక్కించి మంచి హిట్స్ అందుకుంటున్నాడు. చివరిగా సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో పెద్ద హిట్ కొట్టాడు. ప్రస్తుతం చిరంజీవి మూవీకి సంబంధించిన పనులతో బిజీగా ఉన్నాడు. ఇటీవలే పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ ప్రాజెక్ట్ మే తర్వాత సెట్స్ పైకి వెళ్లనుంది. అయితే ఇప్పుడు అనీల్ రావిపూడికి సంబంధించిన వార్త ఒకటి నెట్టింట హల్‌చల్ చేస్తుంది. అనిల్ తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తనకు ఫ్లైట్ ఫోబియా ఉందని , . విమానం ఎక్కినప్పుడల్లా అది కూలిపోయి చచ్చిపోతాననే భయం తీవ్రస్థాయిలో ఉండేదని చెప్పారు. విమానం గాల్లోకి ఎగిరిన తర్వాత ఆకాశంలో ఉండే గాలి వేగానికి విమానం ఎక్కడ సముద్రంలో కూలిపోతుందో లేదంటే గాల్లోనే ఎక్కడ క్రాష్ అవుతుందో అని భయపడేవాడట. ఆ కారణంగా కొన్నిసార్లు ఫ్లైట్ ఎక్కకపోయేవాడట. తొలిసారిగా 2009లో ఫ్లైట్‌లో ఆస్ట్రేలియా వెళ్లినట్టు చెప్పిన అనీల్ ఆ తర్వాత చాలా ఏళ్లు అసలు విమానం ఎక్కలేదని చెప్పారు. ఫ్లైట్ ఫోబియాతో అనేక ఇబ్బందులు పడ్డానని కాని చివరికి తనకు తానే ఆ భయాన్ని ఓవర్‌కమ్ చేసినట్లు చెప్పుకొచ్చారు. అయితే ఆ ఫోబియాని పోగొట్టుకునేందుకు గాను ఎక్కువగా పుస్తకాలు చదవడం, అసలు విమానం కూలిపోయేందుకు ఎంత శాతం అవకాశం ఉందని గూగుల్‌లో వెతికేవాడట. అయితే కూలిపోవడంకి అవకాశం 0.9 శాతం మాత్రమే అని తెలుసుకున్నాను. టర్బులైన్స్ వల్ల విమానానికి ఏదైనా ప్రమాదం జరిగితే అది క్రాష్ కాదని తెలుసుకున్నానని, ఆ తర్వా తనకు ధైర్యం వచ్చిందని అన్నారు. భయాన్ని పోగొట్టుకునేందుకు రెగ్యులర్‌గా ఫ్లైట్‌లలో ప్రయాణించినట్లు చెప్పుకొచ్చారు. కొన్నిరోజులైతే ఉదయం ఒక విమానం, సాయంత్రం ఒక విమానంలో ట్రావెల్ చేసినట్లు తెలిపారు.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com